శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## వినాయక చవితి వేడుకల్లో పాల్గొన్న కావలి ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** కావలి పట్టణ గవర్నమెంట్ హాస్పిటల్ ఎదురుగా అస్లాం ఫ్రూట్స్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయ క చవితి వేడుకలలో కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి సోమవారం పాల్గొని విఘ్నేశ్వరుడికి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దగుమాటికి నిర్వాహకులు ఘనస్వాగతం పలికి దుశ్శాలువలతో, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట ఎన్డీఏ కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరద సహాయక చర్యల్లో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

### ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని భరోసా



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** విజయవాడలో ఇటీవల వచ్చిన వరదలకు జనజీవనం అస్తవ్యస్తమైన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సోమవారం విజయవాడ నగరంలో పర్యటించి బాధితులను ఓదారుస్తూ వారి సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారం చూపుతూ అండగా నిలవడమే కాకుండా ప్రభుత్వం తరపున భరోసా అందిస్తున్నారు. విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలోని 54వ డివిజన్ పరిధిలో మహంతిపురం, గాంధీబొమ్మ, వించిపేట ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించి ప్రభుత్వం సమకూర్చిన రేషన్‌ను ఇంటింటికి వెళ్లి అందిస్తున్నారు. అదేవిధంగా ఆ ప్రాంత వాసులకు కూరగాయలు, పండ్లు, మెడిసిన్‌లు, పాలు అందిస్తూ తమ ఉదారతను చాటుకుంటున్నారు. ముఖ్యంగా ఆయా ప్రాంతాల్లో ఆమె ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందాల్సిన సేవలు, ఇతర వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరదల వలన నష్టపోయిన బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. ఇంత వయస్సులో కూడా ఆయన వరద ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలు ఎవ్వరూ అధైర్యపడొద్దని చెప్పడం ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతుందన్నారు. ఇటువంటి ఆపత్కర పరిస్థితుల్లో ప్రజలు ఎవరు కూడా అధైర్యపడొద్దని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.

## ఘనంగా గణేష్ నిమజ్జన వేడుకలు



**ముత్తుకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** అదాని కృష్ణపట్నం పోర్టులో గణేష్ నిమజ్జన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పోర్ట్ అడ్మిన్ భవనంలో ఏర్పాటు చేసిన గణేష్ ప్రతిమకు గత మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణేష్ నిమజ్జన వేడుకల్లో ఆదాని కృష్ణపట్నం పోర్టు సిఈవో జీజే రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాద స్వీరించారు. అలాగే అదాని కృష్ణపట్నం పోర్టు ఫోర్ట్ సిఓఓ రాజన్ బాబు, కార్పొరేట్ అఫైర్స్ హెడ్‌జీ వేణుగోపాల్, అడ్మిన్ హెడ్ గణేష్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అత్యంత వైభవంగా గణేష్ నిమజ్జనం వేడుకను నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఏజీఎం గంగా సతీష్, పుచ్చలపల్లి శ్రీనివాసులు, రాజేష్ యాదవ్, వివిధ విభాగాలు హెచ్‌ఓడిలు, అడ్మిన్ టీం, పోర్టు ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు తనవంతు సాయంగా ఒక నెల వేతానాన్ని విరాళంగా అందజేసిన వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** విజయవాడకు భారీ వరద పోటెత్తి ఎంతో మంది ఆహారానికి కూడా ఇబ్బంది పడుతున్న తీరు తనను కలిచివేస్తున్నదని అందకే వరద బాధితులను ఆదుకునేందుకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తన వంతు సహాయంగా ఒక నెల వేతనం రూ. 1,75,000 చెక్కును వైఎస్ఆర్ కాంగ్రెస్ లెజెస్లేచర్ పార్టీకి పంపారు. త్వరగా ఈ విపత్తు నుండి విజయవాడ ప్రజలు సురక్షితులు కావాలని కోరుకుంటున్నానని తెలిపారు.

## వరద ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





**కందుకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలతో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గుళ్ళా మాధవితో కలిసి సోమవారం విజయవాడ పరిధిలోని వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ముందుగా మైలవరం నియోజకవర్గం, విజయవాడ రూరల్ పరిధిలోని గొల్లపూడి వంతెన, జక్కంపూడి హౌసింగ్ కాలనీలో ముమ్మరంగా పర్యటించారు. మోకాలు లోతు నీళ్లలోనే ప్రతి ఇంటికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యవసర వస్తువులు సరిగ్గా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. తమ ప్రాంతంలో మొదటి అంతస్తులు మొత్తం పూర్తిగా నీటిలో మునిగిపోయామని పలువురు మహిళలు చెబుతూ వారం నుంచి తాము అనుభవించిన బాధలన్నీ నాగేశ్వరరావుతో పంచుకున్నారు. కొంత మంది తమకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇళ్లు, దుకాణాల్లో వస్తువులన్నీ పనికి రాకుండా పోయాయని చెప్పారు. దీంతో ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఇళ్లల్లోకి స్వయంగా వెళ్లి పరిస్థితిని చూశారు. కొన్ని చోట్ల ప్రభుత్వం తరుపున జరుగుతున్న వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. అయితే ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టడంతో ప్రాణనష్టం తప్పిందని మహిళలు ఎమ్మెల్యేలతో చెప్పారు. ప్రభుత్వంతో పాటు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో ఆహారం, మంచినీరు, నిత్యవసర వస్తువులు అందించారని బాధితులు చెప్పారు. సోమవారం మధ్యాహ్నానికి విద్యుత్ సరఫరా పూర్తి స్థాయిలో పునరుద్ధరించారని తెలిపారు. ఇంకా కొన్ని చోట్ల ఇళ్లలో జరుగుతున్న బురద క్లీనింగ్ పనులు జరుగుతుండగా నేతలు పరిశీలించారు.

**మంత్రులతో కలిసి పర్యటన:** సాయంత్రం మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామితో కలిసి ఇంటూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ కాలనీలో పర్యటించారు. ప్రతి వీధికి వెళ్లి బాదితులతో మాట్లాడారు. నష్టపరిహారాన్ని వీలైనంత త్వరగా అంచనా వేసి, బాధితులను ఆదుకుంటామని మంత్రులు భరోసా ఇచ్చారు. కందుకూరు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన విద్యుత్ శాఖ అధికారులు, ఇతర సిబ్బంది, ఇదే ప్రాంతంలో విద్యుత్ పునరుద్దరణ పనుల్లో విధులు నిర్వహించడాన్ని ఎమ్మెల్యే నాగేశ్వరరావు గమనించారు. పనుల పురోగతిని తెలుసుకోవడంతో పాటు వారందరిని అభినందించారు. అదే ప్రాంతంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ను మంత్రులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

## ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు అర్బన్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ అధికారులు ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలు రిఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలు ప్రభుత్వం విధించిన గడువులోగా పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను సరైన కారణం లేకుండా తిరస్కరించవద్దని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ కన్నమనాయుడు, జిల్లా పంచాయితీ అధికారి సుస్మితారెడ్డి, రవాణాశాఖ ఉప కమిషనర్ చందర్, ఆర్టీసి రీజినల్ మేనేజర్ విజయరత్నం, జిల్లా విద్యాశాఖ అధికారి పివి రామారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వేదిక ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించండి ఎస్పీ కృష్ణకాంత్



**నెల్లూరు క్రైం, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే విచారించి చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పి కృష్ణకాంత్ ఆదేశించారు. స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్ నందు ఎస్పి జి. కృష్ణ కాంత్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 80 అర్జీలు సేకరించారు. అపరిచిత వ్యక్తుల నుండి వచ్చిన ఫోన్ కాల్స్, మెసేజ్‌ల ద్వారా సైబర్ నేరాల ఊబిలో పడొద్దని, అనవసర లింక్‌లు ఓపెన్ చేయవద్దని, పోలీసులకు ఫిర్యాదు చేయాలని బాధితులకు ఎస్పి సూచించారు. అనంతసాగరంనకు చెందిన మహిళను బుచ్చికి చెందిన మస్తాన్ అనే వ్యక్తి అతని అనుచరులు కలిసి తక్కువ ధరకే భూమి, బంగారం ఇప్పిస్తానని ప్రలోభ పెట్టి రూ. 65 లక్షలు నగదు తీసుకొని మోసం చేసారని ఫిర్యాదు చేయగా, విచారించి న్యాయం చేయాలని ఆదేశించారు. దర్గామిట్టకు చెందిన వ్యక్తి తన తల్లి చనిపోయినట్లు, ఎవరూ వారసత్వం లేనట్లుగా కల్పించి, అతని చిన్నాన మోహన్ అనే వ్యక్తి నకిలీ పత్రాలు సృష్టించి, వారి ఇళ్ళు అమ్మేశాడని ఫిర్యాదు చేయగా, వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పడారుపల్లికి చెందిన ఓ అపార్ట్మెంట్‌లో సిసి కెమెరాలు పెట్టరాదని, వాచ్ మెన్ ఉంచరాదని మెయింట్నెన్స్ వ్యక్తిని మాధవి, భాగ్యరాజ్ అనే వారి బెదిరిస్తూ, గుర్తు తెలియని వ్యక్తులు వెంబడిస్తూ, తిడుతూ, ఫోటోలు తీస్తున్నారని, వారి ద్వారా ప్రాణహాని ఉందని, రక్షించాలని కోరగా, వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని వేదాయపాలెం సిఐని జిల్లా ఎస్పి ఆదేశించారు. హైదరాబాదుకు చెందిన మహిళను నెల్లూరు టౌన్ వేదాయపాలెం పరిధిలోని తన మేనమామ పెళ్లి చేసుకుంటానని నమ్మించి, లైంగికంగా లోబరుచుకున్నాడని, ఇప్పుడు పెళ్లి చేసుకోకుండా మోసం చేసాడని, వారి కుటుంబ సభ్యులకు పూర్తి విషయం తెలిసినా సహకరించట్లేదని, మోసపోయానని, న్యాయం చేయాలని కోరగా, వెంటనే విచారించి చర్యలు తీసుకోవాలని ఎస్పి ఆదేశించారు. సంగం పరిధికి చెందిన కొండయ్య మరికొందరు రైతులు ఎఎస్ పేటకు చెందిన మహేష్ రెడ్డి అనే దళారికి రూ. 22 లక్షలు విలువ గల ధాన్యం అమ్మగా, ఇప్పటివరకు నగదు ఇవ్వలేదని, న్యాయం చేయాలని విన్నవించగా, వెంటనే విచారించి న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని జిల్లా ఎస్పి హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పితో పాటు అడిషనల్ ఎస్పి (అడ్మిన్) సిహెచ్ సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు

## నిర్ణీత సమయంలోపు ప్రజా సమస్యలను పరిష్కరించండి : అదనపు కమిషనర్ శర్మద



**నెల్లూరు కార్పొరేషన్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శర్మద పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ కమిషనర్ సూర్య తేజ ప్రస్తుతం విజయవాడలో వరద సహాయక చర్యల విధుల్లో ఉన్న కారణంగా ఆయన ఆదేశాల మేరకు ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అందుకున్న సమస్యలకు సత్వరమే పరిష్కార వేదికలో అనధికార కట్టడములు, కాలువల పూడికలు, ఆస్తి పన్నులకు సంబందించిన అంశాల పై ప్రజల నుంచి అందుకున్న సమస్యలకు నిర్ణీత సమయములోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలపు సమస్యలను అధిగమించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అండర్ బ్రిడ్జిలలో వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అన్ని డ్రైను కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను చేపట్టాలని సూచించారు. ప్రస్తుతం అందుకున్న వినతులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని అదనపు కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్-5 టౌన్ ప్లానింగ్-7, పబ్లిక్ హెల్త్-3, హౌస్ ఫర్ ఆల్ -3, ఆప్కోస్ -1 , మొత్తం 19 ఫిర్యాతులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్నారు. నగర పాలక సంస్థ , ఇంజనీరింగ్ ఎస్. ఈ సంపత్ కుమార్, , సిటీ ప్లానర్ దేవి కుమారీ, ఆరోగ్య శాఖాధికారి మేనేజర్ ఇనాయత్తుల్లా ఇతర అన్ని విభాగాలఅధి కారులు, సూపరింటెండెంట్‌లు, సిబ్బందిపాల్గొ న్నారు.

## చంద్రబాబు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నాడు : మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి



**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** వరద సహాయక చర్యల్లో చంద్రబాబు వైఫల్యం వాటిని కప్పి పుచ్చుకోవడానికే డైవర్షన్ పాలిటిక్స్ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరు మాగుంట లేఔట్‌లోని జిల్లా వైఎస్ఆర్‌సిపి కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వంద మరణాలన్నీ కచ్చితంగా ప్రభుత్వ హత్యలే ముందస్తు హెచ్చరికల్లోనూ ప్రభుత్వ వైఫల్యం ఇప్పుడు కూడా పబ్లిసిటీ కోసం నానా హంగామా అంతే తప్ప వరద బాధితులకు ఒరిగిందేమీలేదు అయినా ఏదేదో చేస్తున్నట్లు ఎల్లో మీడియాలో ప్రచారం ఇకనైనా వరద బాధితులపై దృష్టి పెట్టండి అని తెలిపారు. రాష్ట్రంలో వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, దాన్ని కప్పి పుచ్చుకోవడానికే సిఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు. ముందస్తు జాగ్రత్తల్లోనే కాకుండా, సహాయక చర్యల్లో కూడా ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన స్పష్టం చేశారు. ఎంతసేపూ గత ప్రభుత్వాన్ని, జగన్‌ను నిందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని, తమ పార్టీ నేతలను టార్గెట్ చేసి కేసులతో వేధించడం దుయ్యబట్టారు. బుడమేరుకు సరిగ్గా 60 ఏళ్ళ క్రితమే వరద వచ్చి అప్పట్లోనే పది మంది మరణించిన విషయాన్ని విషయాన్ని ప్రస్తావించిన కాకాణి, ఇవన్నీ చంద్రబాబుకు తెలియదా? అని ప్రశ్నించారు. చంద్రబాబు, మీద రియల్ టైం గవర్నెన్స్ అంటారు కదా? మరి ఇవన్నీ ముందే ఎందుకు పసిగట్టలేదని కాకాణి ప్రశ్నించారు. కృష్ణానదిపై ఫ్లాష్ ఫ్లడ్స్ వస్తే ఫ్లడ్ కుషన్ ఎందుకు చేయలేకపోయారో సమాధానం చెప్పాలన్నారు. ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా? అని గట్టిగా నిలదీసిన ఆయన, ఇరిగేషన్ శాఖ ప్రభుత్వానికి అలెర్ట్ ఇచ్చినా చంద్రబాబుకు ప్రజల ప్రాణాలంటే లెక్కలేకపోవడం వల్లే ఇంతమంది ప్రాణాలు కోల్పోయారని, ఇవన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. లక్షలాది జనాన్ని గాలికొదిలేసి, చంద్రబాబు మాత్రం తన అక్రమ కట్టడం నుంచి పారిపోయి కలెక్టరేట్‌ను పునరావాస కేంద్రంగా మార్చుకున్నారన్నారు. జనాన్ని మాత్రం తరలించలేదని, పైగా తన ఇల్లు మునిగిపోయిందంటే పరువు పోతుందని కలెక్టరేట్‌లో ఉంటూ కలరింగ్ ఇచ్చారని కాకాణి ఎద్దేవా చేశారు. వర్షాలు, వరదల వల్ల ఉద్యాన పంటలు లక్షలాది ఎకరాలు నీట మునిగాయన్న కాకాణి, గతంలో తమ ప్రభుత్వంలో ఇలా జరిగితే, వెంటనే రైతులను ఆదుకున్నామని గుర్తు చేశారు. చంద్రబాబు తక్షణమే రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజల దృష్టి మళ్లించడానికి చంద్రబాబు, డైవర్షన్ పాలిటిక్స్ మొదలు పెట్టారన్న ఆయన, ఎక్కడో బోట్లు, కొట్టుకుపోతే దానికి వైఎస్ఆర్‌సిపికు ముడి పెట్టడం కుట్రలో భాగమేనన్నారు. స్కిల్ స్కామ్‌లో పక్కా ఆధారాలతో చంద్రబాబును అరెస్టు చేస్తే, అది అక్రమ అరెస్టు అంటూ ఎల్లో మీడియా గగ్గోలు పెట్టిందన్న మాజీ మంత్రి, అన్ని ఆధారాలు ఉండబట్టే, , చంద్రబాబును జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారని చెప్పారు. చంద్రబాబుకు భజన చేసే మీడియా జాకీలు పెట్టి మరీ బాకాలు ఊదుతోందని, ఆయన ప్రాణాలు ఫణంగా పెట్టి వరద ప్రాంతాల్లో తిరుగుతున్నారని అదేపనిగా ఊదరగొడుతున్నారని ఆక్షేపించారు. ఇప్పటికైనా చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ మాని, వరద ప్రాంతాల్లో పరిస్థితులను చక్కదిద్దాలని, బాధితులను అన్ని విధాలుగా ఆదుకోవాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

## నీతి నిజాయితీ పారదర్శకతకు నిదర్శనం బాబు



**నెల్లూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** నీతి నిజాయితీ పారదర్శకంగా ప్రజలకు పరిపాలనను అందించడంలో నిదర్శనం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్ కొనియాడారు. సోమవారం అజీజ్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసందర్భంగా అబ్దుల్ అజీజ్ చంద్రబాబును అక్రమ అరెస్టు చేస్తే వర్గాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలందరూ ఖండించారు. అన్ని రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. దేశ వ్యాప్తంగా మద్దత తెలిపారు. 75 దేశాల్లో చంద్రబాబుకు సంఘీభావం ప్రదర్శనలు చేశారు. విడుదలైన రోజు రాజమండ్రి నుండి విజయవాడ చేరడానికి రాత్రంతా జనం రోడ్లపై జాగారం చేసి చంద్రబాబుకు స్వాగతం పలికారు. అరెస్టు అయిన ఏ రాజకీయ నేతకు ఇలాంటి సంఘీభావం రాలేదంటే అతిశయోక్తి కాదు. చంద్రబాబుకు నీర ఘటనలో భాగస్వామ్యం ఉన్నట్లు ప్రాథమికంగా కనిపించడం లేదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆయనను అరెస్టు చేయడానికి ముందు మాత్రమే ఆయన పేరును నమోదు చేసినట్లు అభిప్రాయపడింది. రాజకీయాల్లో ఎటువంటి మచ్చలేని చంద్రబాబును జగన్‌రెడ్డి తప్పుడు కేసులతో అక్రమంగా అరెస్టు చేసి నేటికి ఏడాది పూర్తవుతుంది. ఈ రోజు యావత్ తెలుగుజాతి మర్చిపోలేని రోజు స్కిల్ డవలప్‌మెంట్‌లో మొదట 3 వేల కోట్లు తర్వాత 3 వందల కోట్లు ఆ తర్వాత 30 కోట్లు అని చివరికి మూడు పైసల కూడా అవినీతికి పాల్పడినట్లు నిరూపించలేకపోయారు. జగన్ తన లూటీ నుండి ప్రజల దృష్టి మళ్లీంచడానికి అధికారంలోకి రాగానే చంద్రబాబు లక్ష్యంగా అనేక తప్పుడు కేసులు నమోదు చేశారు. వారి ఆరోపణలకు కనీస ఆధారాలు చూపలేకపోయారు. ఐదేళ్ల జగన్ పాలనలో చంద్రబాబుపై 12కు పైగా తప్పుడు కేసులు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే నవాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తుంది. ఐదేళ్ల జగన్ పాలన లూటీలు, నేరాలు, కక్షలకు, కార్పణ్యాలతో కాలం వెలిబుచ్చితే కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్దే ధ్యేయంగా ముందుకు వెళ్తుందన్నారు.

## కోలహాలంగా గణేష్ నిమజ్జన వేడుకలు



**కలువాయి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** వినాయకచవితి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని ప్రాంతాలలో గణేష్ మండపాలలో స్వామి వారి విగ్రహాలను ఏర్పాటుచేసి భక్తి శ్రద్దలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూడోరోజు అయిన సోమవారం నిమజ్జన వేడుకలను కోలహాలంగా ఆనందోత్స హాలతో నిర్వహించారు. ఇందులోభాగంగా మండలకేంద్రమైన కలువాయిలో ప్రత్యేకించి పలు వీధుల నందు వినాయక మండపాల వద్ద పంచామృతాబిషేకాలు ఆకుపూజ,గణపతిహోమాలు,శివుని ప్రతిమకు రుద్రాబిషేకాలు సామూహిక పూజా కార్యక్రమాలతోపాటు విశేష పూజలు నిర్వహించారు. అదే విధంగా పునాగాని వారి వీధి నందు 20 సంవత్సర వినాయకచవితి వేడుకలలో నిర్వహించే నిమజ్జన కార్యక్రమంలో భాగంగా ఆనవాయితీగా నిర్వహించే స్వామి వారి లడ్డు వేలం పాటలో ఉయ్యాల శ్రీనివాసులు,సుజాత దంపతులు సుజిత ,పూజిత లు 20 వేల రూపాయాలకు పాట పాడుకొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించారు. గణేష్ మహారాజ్‌కి జై అంటు నినాదాలు చేస్తు స్వామి వారి నిమజ్జనాన్ని కొనసాగించారు. నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా కలువాయి సబ్ ఇన్స్పెక్టర్ సుమన్ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బుచ్చి హరిజనవాడ,అరుంధీయ వాడ సెంటర్లలో పౌష్టికాహార మాసోత్సవాలు



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం హరిజనవాడ, అరుంధతీయ వాడ అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు.ఈకార్యక్రమం సూపర్‌వైజర్ శకుంతల సూచన మేరకు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్ వ్యవహారించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.సుబ్బమ్మ, బి వాసవి పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. తల్లులకు పౌష్టికాహార విశిష్టత గురించి తెలియజేశారు. అనంతరం కౌన్సిలర్ జూగుంట కళ్యాణ్ మాట్లాడుతు ప్రభుత్వం తల్లుకు,బిడ్డలకు పౌష్టికాహారం అందజేస్తుందని ప్రతి ఒక్కరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సింధూర,సిహెచ్.సుమలత,వై.ఝాన్సీ,సిహెచ్ శేషమ్మ, ఎఎన్ఎం సిహెచ్ వరలక్ష్మి, ఎంఎస్‌కె అయిషా, ఆశావర్కర్ జి ఆదిశేషమ్మ,తల్లులు ,గర్భవతులు పాల్గోన్నారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి



**గుడ్లూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** సీసీ కెమెరాలు ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కందుకూరు డీఎస్పీ శ్రీనివాస్ కోరారు. సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం గుడ్లూరు పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొన్ని పాడైపోయాయని దాతలు ముందుకు రావాలని తెలిపారు. వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. సాయంత్రం 6గంటలలోపు నిమజ్జనాలు పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు. బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, మందుబాబులు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట గుడ్లూరు సీఐ మంగారావు ఉన్నారు.

## వరద బాధితులకు విరాళం



**ఉలవపాడు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలువు మేరకు విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు వస్తున్నారు. ఉలవపాడు మండలం చాకిచర్ల పంచాయతీ సర్పంచ్ వీరమల్లు విజయమ్మ కుమారుడు సురేష్ బాధితుల కోసం రూ.10వేల విరాళాన్ని సోమవారం అందించారు. కందుకూరు పట్టణ టీడీపీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పార్టీ నాయకులు పొడపాటి సుధాకర్ చేతుల మీదుగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో చాకిచర్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడు మిరియం మల్లిఖార్జున పాల్గొన్నారు.

## మొదలైన నిమజ్జనోత్సవాలు



**ఉలవపాడు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** ఉలవపాడులో వినాయక నిమజ్జనోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉలవపాడు మండలం నలుమూలల నుండి విచ్చిన వినాయక ప్రతిమల నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్దలతో ప్రారంభమయ్యాయి. వినాయక చవితి నాడను విశేష పూజలందుకున్న గణపతి ప్రతిమలు ఆయా గ్రామాల నుండి ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై కొలువు దీరి తీన్మార్ డప్పులు, డీజే సౌండ్స్, కనక తప్పెట్లు, మందు గుండు సామాగ్రి పేలుళ్లతో ఊరేగింపుగా వచ్చి అలగాయపాలెం, కరేడు, చాకిచర్ల, రామాయపట్నం సముద్రంలలో గణేష్ నిమజ్జనాలు జరుగుతున్నాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా మెరైన్ సీఐ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## నల్లగా మారిన సముద్రపు నీరు



**ఉలవపాడు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** ఉలవపాడు మండలం కరేడు గ్రామ పంచాయతీలోని అలగాయపాలెం వద్ద సముద్రపు నీరు నల్లగా మారింది. గణేష్ నిమజ్జనానికి సోమవారం అక్కడకు వెళ్లిన భక్తులు నల్లటి నీరును చూసి ఆందోళన చెందారు. వినాయక చవితి మూడో రోజు కావడంతో మండలంలోని కొన్ని గ్రామాల భక్తులు సోమవారం గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. మన్నేటికోట, ఉలవపాడు వంటి కొన్ని గ్రామాల గణేష్ విగ్రహాలను నిమజ్జనానికి అలగాయపాలెం వద్ద సముద్రానికి తీసుకెళ్లారు. గణేష్ నిమజ్జన సమయంలో భక్తులు సముద్ర స్నానాలు చేయటం ఆనవాయితీ అయితే నీరు నల్లగా ఉండటంతో అనేక మంది భక్తులు సముద్ర స్నానం చేయకుండానే వెనక్కి తిరిగి వచ్చారు. సమీపంలోనే ఉన్న ఆక్వా హ్యాచరీల నుండి విడుదలవుతున్న కలుషిత జలాలే సముద్రం నీరు నల్లగా మారడానికి కారణం అని భక్తులు తెలుసుకున్నారు. దీంలో పలువురు భక్తులు ఆక్వా హ్యాచరీల వ్యవహార తీరుపై మండిపడ్డారు. గణేష్ నిమజ్జనం జరిగే ప్రాంతంలోనే సముద్ర తీరంలో సుమారు తొమ్మిది ఆక్వా హ్యాచరీలు ఉన్నాయి. ఈ హ్యాచరీలు ప్రతి రోజు వేలాది లీటర్ల కలుషిత జలాలను సముద్రంలోకి గొట్టాల ద్వారా విడుదల చేస్తున్నారు. అధికారులు ఎవరు ఈ విషయం పట్టించుకోవడం లేదు.

## కొండూరు సత్రంలో అన్నదానం



**మనుబోలు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** వినాయక చవితి వేడుకల్లో భాగంగా సోమవారం జ్యోతినగర్ గ్రామంలో ఆ గ్రామ ఉప సర్పంచ్ ఆవుల తులసిరామ్ యాదవ్ సమక్షంలో భారీ అన్నదానం నిర్వహించారు. అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో జ్యోతినగర్‌లో పట్టాలు, రోడ్లు, కాలువలు, ట్రాన్స్‌ఫార్మర్ ఇంటిమీద కరెంట్ లైన్ సమస్యలను పరిష్కరించుకున్నామని ఈ సందర్భంగా ఉప సర్పంచ్ ఆవుల తులసిరామ్ యాదవ్ గుర్తు చేసుకున్నారు. ఈ నేపధ్యంలో ఇక్కడ వినాయక చవితి పండుగ జరుపుకుంటున్నామని చెప్పారు. ఈ అన్నదాన కార్యక్రమంలో వైకాపా నేత ఆవుల జగదీష్‌యాదవ్, శేఖర్ చిన్న, సాయి, వార్డు సభ్యులు సురేష్, రవి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జననానికి తరలిన గణనాధులు

**వింజమూరు, సెప్టెంబర్9ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని 7వ తేదీ మండపాల్లో కొలువుదీరిన గణనాధులు మూడురోజులుగా భక్తులతో పూజలందుకొని సోమవారం నిమజ్జననానికి తరలారు. బిసికాలనీ, పాతూరు, వైశ్యాబజార్, జైభీంనగర్ , పలు ప్రాంతాల నుండి గణనాధులు ప్రత్యేక వాహనాలపై నిమజ్జననానికి తరలి వెళ్ళారు. భక్తులు జైజైగణేషా అంటూ బాండు మేళాల మోతలతో, రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ నిమజ్జననానికి బయలుదేరారు.

## విద్యార్థులకు ఫర్నిచర్ అందజేత

**అల్లూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** అల్లూరు మండలంలోని ఇస్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఫర్నిచర్ మరమ్మతులు చేసి అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎంఇవో సునీత మాట్లాడుతూ ఫర్నిచర్ మరమ్మతుల నిమిత్తం స్కూల్ మెయింటెనెన్స్ ఫండ్ నుండి 2 లక్షల రూపాయలు కేటాయించి వంద బెంచిలు మరమ్మతులు చేయడం జరిగిందన్నారు. ఫర్నిచర్ అందజేయడం వల్ల విద్యార్థులకు సౌకర్యంగా వుందన్నారు. బీద సోదరులు, బుజ్జంగారి బాబు సహకారంతో ఫర్నిచర్ మరమ్మతులు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాల్యాద్రి, ఉపాధ్యాయులు ప్రభాకర్, భాస్కర్, బంగారు బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భారీగా నిమర్జనానికి తరలి వెళ్లిన గణనాధులు



**కావలి రూరల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని కావలి, చుట్టు పక్కల ప్రాంతాలలో విశేష పూజలు అందుకున్న గణనాధులు సోమవారం భారీగా నిమర్జనానికి తరలివెళ్లాయి. కావలి రూరల్ మండలం తీర ప్రాంతమైన తుమ్మలపెంట, కొత్తసత్రం, చెన్నాయపాళెం పెదపట్టపుపాళెంలకు గణనాధులు నిమజ్జనానికి మేళతాళాలతో, భారీగా బాణాసంచా కాలుస్తూ, రంగులు చల్లుకుంటూ ,డిజె శబ్దాలతో తరలివెళ్లాయి. ఈ గణనాధుల అన్నింటిని వరుస క్రమంలో నిమర్జనానికి పంపిస్తూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కావలి రూరల్ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయక చవితి మూడో రోజు అయినందున అత్యధికంగా గణనాధుల విగ్రహాలు తదితర ప్రాంతాల నుండి తరలి రావడంతో తీర ప్రాంతమంతా భక్తులతో కిక్కిరిసి అక్కడ పండుగ వాతావరణం నెలకొంది. గణేష్ మహరాజ్‌కు జై అంటూ నినాదాలు చేస్తూ గణనాధులను నిమజ్జనం చేయడం జరిగింది. అత్యంత భక్తి శ్రద్దలతో గణనాధుల నిమర్జనోత్సవం అత్యంత ప్రశాంతంగా జరిగింది. ఈ నిమర్జనోత్సవంలో పురుషులకు ధీటుగా మహిళలు కూడా పాల్గొని భక్తిని చాటుకోవడం జరిగింది. గణనాధుల నిమర్జన ప్రదేశాలకు కావలి డీఎస్పీ వెంకట రమణ, కావలి రూరల్ సిఐ రాజేశ్వరరావులు పరిశీలించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టారు,

## కన్నుల పండుగగా గణణాధుని నిమజ్జన వేడుకలు



**చేజర్ల సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** చేజర్ల మండలంలో పలు గ్రామాలలో వినాయకుడి విగ్రహాలు ఏర్పాటు చేసి మూడో రోజులు పూజా కార్యక్రమాలు నిర్వహించి మూడోరోజు కన్నుల పండుగగా వినాయకుడి నిమజ్జనంకు గణపతి బప్పా మోరియా అంటు తరలి వెళ్లారు. వినాయకుడ్ని ట్రాక్టర్ లోపెట్టి గ్రామోత్సవం నిర్వహిస్తు డిజెతో వాహనంతో పాటు కోలహలంగా యువకులు ఆటల పాటలతో నిమజ్జనానికి తరలి వెళ్లారు. అంతే కాకుండా తమ ఇంట్లో పెట్టి నటువంటి 3 అడుగుల విగ్రహం మూడరోజు పూజా కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనం చేశారు.మూడో రోజు పలు గ్రామా లలో అన్నదానం నిర్వహించారు.పోలీసులు నిమజ్జనం ఏర్పాట్లు వద్ద ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందుస్తుగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో యువకులు, గ్రామప్రజలు పాల్గోన్నారు.

## రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా



**మనుబోలు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. సీపీఎం పార్టీ నాయకులు కటికాల వెంకటేశ్వర్లు సమక్షంలో ఇక్కడ నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు తలారి దేవదానం మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం రైతుల సమస్యలను గాలికొదిలేసిందని విమర్శించారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం కూడా కౌలు రైతులకు రుణాలు ఇవ్వడంలో జాప్యం చేసిందన్నారు. స్వామినాథన్ కమీషన్‌ను అమలు చేయడం లేదని కాగితాలపూరు గ్రామంలో గత 30 ఏళ్లుగా సాగుచేసిన రైతులకు ఇంత వరకు పట్టాలు ఇవ్వలేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను ఇంత వరకు అమలు చేయలేదని, ఇంత వరకు రైతులకు పెట్టుబడి సాయం కూడా ఇవ్వలేదని విమర్శించారు. అనంతరం తహశీల్దార్ సుబ్బయ్యకు మెమోరాండం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## వృద్ధ నిరక్షరాస్యులకు ఆధార్‌లో వయసు అప్డేట్ చేయాలి



**ఇందుకూరుపేట, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** వృద్ధ నిరక్షరాస్యులకు ఆధార్‌లో వయసును అప్డేట్ చేయాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కైలాసం శ్రీనివాసులురెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఇందుకు సంబంధించి ఆయన వృద్దులతో కలిసి స్థానిక ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వోను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. చదువు ఉన్న వారికి సర్టిఫికేట్స్ ప్రకారం ఆధార్‌లో వయస్సును ధృవీకరిస్తారని, అదే చదువు లేని వారికి వయస్సును అప్డేట్ చేయడం లేదని, దీని వలన వారు ప్రభుత్వం నుంచి వచ్చే పింఛన్‌ను కోల్పోతున్నారని తెలిపారు. వీటిని ప్రభుత్వం పరిశీలించి గతంలో డాక్టర్ సర్టిఫికేట్స్ ఆధారంగా అనుమతించారు. అలాగే కమిటీ వేసి కమిటీ పరిశీలించి వాస్తవంగా వారు అర్హులైతే వారికి అనుమతించాలని కోరారు. రేషన్ కార్డు సింగల్‌గా ఉండే వారికి పింఛన్ రావడం లేదని, వారికి పింఛన్ వచ్చేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు శ్రీనివాసులు, వాకాటి ప్రసాద్, మేనాటి పవన్‌రెడ్డి, సాయి, గుమ్మడి, పరందామయ్య, ఎం.వెంకట రమణయ్య, అతిపాటి శరత్, ఎస్‌కే మీరయ్య, దొంతాల మహేష్, నెల్లూరు వెంకట శేషయ్య, తువ్వర రాంబాబు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవాలు



**ఆత్మకూరు, మర్రిపాడు, సెప్టెంబర్9ప్రభాతవార్త:** ఆత్మకూరు, మర్రిపాడు మండలాల్లో సోమవారం గణేష్ నిమజ్జన కార్యక్రమాలు అట్టహాసంగా జరిగాయి. వినాయకచవితి పర్వదినం సందర్భంగా శనివారం అలంకరించిన మండపాల వద్ద గణనాధులను ప్రతిష్టించారు. శని, ఆదివారాల్లో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలను , అన్నదాన కార్యక్రమాలను ,భజనలతో వినాయకుని విగ్రహాల వద్ద భక్తులు కోలాహలంగా జరిపారు. పలు గ్రామాల్లో డిజెలు, పండరిభజన, కోలాటాలు , గ్రూప్ డాన్స్‌లతో గణేష్ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. పలు గ్రామాల్లో 3వ రోజు సోమవారం ఆయా మండపాల వద్ద ఉట్టి మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం డిజె లు, యువత కేరింత ల మధ్య గణనాధుల నిమజ్జననానికి తరలారు. ఆత్మకూరు పట్టణంలో ఏర్పాటు చేసిన విగ్రహాలు నిమజ్జనం కొరకు సమీపంలోని పెన్నానది, మరికొన్ని విగ్రహాలను సంగంకు తరలించారు. మర్రిపాడు మండలంలోని డిసిపల్లి ,నందవరం, పొంగూరు, కేతిగుంట గ్రామాలకు చెందిన వినాయక విగ్రహాలను కచేరిదేవరాయపల్లి, పాతదేవరాయపల్లి ప్రాంతాలకు నిమజ్జన కార్యక్రమానికి తరలించారు. మర్రిపాడు,పల్లవోలు, పడమటినాయుడుపల్లి, చుంచులూరు, సింగనపల్లి , బ్రాహ్మణపల్లి తదితర గ్రామాలకు సంబంధించిన గణనాధుని విగ్రహాలను నిమజ్జననం కొరకు సోమశిల జలాశయానికి తరలించారు. మరికొన్ని గ్రామాల్లో 5రోజులపాటు గణనాధుల వేడుకలను నిర్వహిస్తున్నారు.

## సబ్ కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** కందుకూరు సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తిరుమణి శ్రీపూజని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెకు పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సమస్యలు, ఇతర అంశాలపై చర్చించారు. మరో వైపు కందుకూరు మున్సిపల్ కమీషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కొర్రపాటి అనూష ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును బడేవారిపాలెంలోని ఆయన ఇంటివద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

## ప్రకాశం బ్యారేజ్ వరద ప్రవాహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**కందుకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** విజయవాడ ప్రకాశం బ్యారేజ్ దగ్గర వరద ప్రవాహాన్ని, దెబ్బతిన్న కౌంటర్ వెయిట్‌లను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం పరిశీలించారు. ఆ సమయంలో అక్కడ పనులను పర్యవేక్షిస్తున్న జలవనరుల శాఖ ముఖ్య సలహాదారు కన్నయ్య నాయుడుతో నాగేశ్వరరావు కొద్దిసేపు మాట్లాడారు.

## తెలుగుదేశం గూటికి చాకిచర్ల సర్పంచ్



**కందుకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** వైసీపీ మద్దతుతో గెలిచిన ఉలవపాడు మండలం చాకిచర్ల పంచాయతీ సర్పంచ్ వీరమల్లు విజయమ్మ సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరగా ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. సర్పంచ్‌తో పాటు 10వ వార్డు సభ్యులు ప్రళయకావేరి అంకయ్య, వైసీపీ నేత తోట వెంకట నారాయణ తదితరులు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావుపై నమ్మకం, ఆయన కల్పిస్తున్న భరోసాతో టీడీపీలో చేరుతున్నామని సర్పంచ్ తెలిపారు. వైసీపీ పాలనలో పంచాయతీలో చిన్న అభివృద్ధి కార్యక్రమం కూడా చేపట్టలేకపోయామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాలతో పంచాయతీల్లో మళ్లీ వెలుగులు నిండుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన వారు ఎమ్మెల్యే నాగేశ్వరరావుని శాలువాతో సత్కరించారు. గ్రామాభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సర్పంచ్‌కు హామీ ఇచ్చారు. పారిశుధ్యం, తాగునీరు, ఇతర అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో చాకిచర్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడు మిరియం మల్లిఖార్జున, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## రైలు పట్టాలపై యువకుని మృతదేహం

**బిట్రగుంట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలోని తలమంచి-అల్లూరు రోడ్డు రైల్వే స్టేషన్ల మధ్యలో సోమవారం గుర్తు తెలియని యువకుని మృతదేహం కనుగొన్నట్లు జిఆర్‌పి పోలీసులు తెలిపారు. యువకుడు వయసు 15-20 సంవత్సరాల మధ్య వుంటుందని తెలిపారు. తెలుపు రంగు టీషర్ట్, బులుగు రంగు జీన్‌ఫ్యాంట్ ధరించి వున్నాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

## ఎంపిడివో తనిఖీలు



**బిట్రగుంట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** బోగోలు ఎంపిడివో వెంకట సుబ్బారావు సోమవారం పలు సమస్య లపై వినతులు స్వీకరించిన తర్వాత క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహిం చారు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి కృషి ఫలితంగా సోమశిల రిజర్వాయర్ నుంచి కడనూతల చెరువుకు సాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన నీటి పరిమాణంతో పాటు విశ్వనాధరావుపేటలో ముస్లిం మైనార్టీ కాలనీకి రోడ్డు వసతి, కోవూరుపల్లి తాగునీటి బావిని ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాసులు, విశ్వనాధరావుపేట, కోవూరుపల్లి పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌బాషా, ప్రసూన, మండల టిడిపి కన్వీనర్ యం.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సుధీర్‌బాబులు వున్నారు.

## గిరిజనుడి మృతికి కారకులైన వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి



**బిట్రగుంట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** బోగోలు మండలం అల్లిమడుగు సంఘానికి చెందిన బచ్చు శంకర్ ఈ నెల 2వ తేదిన పాము కాటుకు గురై మృతి చెందిన సంఘటనలో కోవూరుపల్లి పిహెచ్‌సి వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారిపై చర్యలు తీసుకోవాలని ఆలిండియా ఎరుకుల హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి కావాటి శ్రీనివాసులు, దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లిలు డిమాండ్ చేశారు. బోగోలు తహశీల్దార్ కార్యాలయం ఎదుట మృతుడు భార్య, చంటి బిడ్డలు, కుటుంబ సభ్యులతో కలిసి వారు ఆందోళన నిర్వహించారు. 2వ తేది రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆరుబయట నిద్రిస్తుండగా నాగు పాము కాటేసిందని వెంటనే సమీపంలోని కోవూరుపల్లి పిహెచ్‌సికి చికిత్స నిమిత్తం తీసుకొని వెళ్లగా ఎలాంటి ప్రధమ చికిత్స చేయకుండా తమవద్ద మందులు లేవని కావలి ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లమని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. కావలి ఏరియా వైద్యశాలకు తరలించలోగా ప్రాణాలు కోల్పోయాడని ఇందుకు బాధ్యులైన వైద్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహశీల్దార్ సురేష్‌కు అందించగా ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన హామీ ఇచ్చారు.

## తల్లిబిడ్డ ఆరోగ్యం సంరక్షించాలి



**కావలి రూరల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ పథకం కింద సోమవారం వెంగళరా వునగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్యశి బిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు రమ్య మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత లేకుండా చూసుకోవాలని తెలిపారు. తల్లిబిడ్డ ఆరోగ్యంగా వుండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్బవతులు డాక్టర్ల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. తల్లిబిడ్డ ఆరోగ్య సంరక్షణే మా బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రామ్‌సెంటర్ ఆధ్వర్యంలో ఐరన్ పాలిక్ సిరప్‌లు, కాల్షియం విటమిన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మి, డాక్టర్ రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, సివో ప్రసాద్, సూపర్‌వైజర్ సుగుణమ్మ, ఎఎన్‌యంలు, ఆశా వర్కర్లు, గర్బవతులు, బాలింతలు పాల్గొన్నారు.

## ఈనెల 11 న రాధే రాధే కృష్ణ మందిరంలో వేడుకలు



**వెంకటాచలం సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** ఈ నెల 11,న వెంకటాచలంలో రాధే రాధే కృష్ణ మందిరంలో కమిటి ఆధ్వర్యంలో రాధాదేవి పుట్టిన రోజు సంధర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించనట్లు ఆలయ కమిటి సభ్యులు తెలిపారు.ఉదయం మూల విరాట్, ఉత్సవ విగ్రహాలకు అబిషేకాలు, పల్లకిసేవ, నిర్వహిస్తారు.

## భక్తులకు అన్నదానం సాయంత్రం పూజలు నిర్వహి స్తారుజ

**బిట్రగుంట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** ఇటీవల విజయవాడ నందు భారీ వరదలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బోగోలు మండలం నుండి విధులు నిర్వర్తించుటకు వెళ్లిన విశ్వనాధరావుపేట పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాషా టీముకు సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడివో రామసుబ్బారావు సన్మానం చేశారు. ఈ టీములో జువ్వలదిన్నె, సిఆర్‌పాళెం, బోగోలు స్వీపర్లు ఏడుకొండలు, కృష్ణయ్య, జీవన్, మహేష్‌లను వారు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో పాలనాధికారి గోవిందరావు, మండల టిడిపి కన్వీనర్ యం.నాగేశ్వరరావు, పార్టీ ప్రధాన కార్యదర్శి సుధీంబాబు, వివిఎస్‌ఆర్‌పేట సర్పంచ్ గండూరు మంజుల, మాజీ ఎంపిటిసి చిలకపాటి వెంకటేశ్వర్లు, ఎంపిడివో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పటిష్ట బందోబస్తు మధ్య గణనాధుల నిమజ్జనం



**బిట్రగుంట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** బోగోలు మండలం తాటిచెట్లపాళెం సముద్ర తీరాన సోమవారం కావలి రూరల్ సిఐ పాపారావు ఆధ్వర్యంలో బిట్రగుంట ఎస్ఐ భోజ్యా, సిబ్బంది బందోబస్తు మధ్య గణనాధుల విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ నిబంధనల మేరకు విగ్రహ కమిటీ సభ్యులు విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఈ సందర్బంగా ఎస్ఐ హెచ్చరించారు. నిమజ్జన కార్యక్రమం ఈ నెల 11వ తేది కూడా కొనసాగనున్నది.

## వినాయక ఒక పక్క అన్నదానాలు మరోపక్క నిమర్జనాలు



**కలిగిరి, శప్టెంబర్09, ప్రభాతవార్త;** వినాయక చవితి పురస్కరించుకొని పల్లెల్లో పట్టణాలల్లో యువత కోలాహలం అధికమైంది.వినాయక చవితకి ఈసారి వరస వరస శెలవులు రావడంతో యువత ఆనందాలకు హద్దేలేదు. వినాయక చవితి పురస్కరించుకొని పోటాపోటీలుగా గ్రామ ల్లో వినాయక మండపాలల్లో గణేష్ విగ్రహాలనుఅత్యదిక సంఖ్యలో కొలువు దీర్చారు. ఒకరిని మించి మరొకరన్న ట్లుగా వేడుకలు మిన్నంటుతున్నాయి. బాణాసంచా ఐతే వినాయకుని చెవులు చిల్లులు పడేలాపేలుస్తున్నారు. వేడుకలు అన్నదానాలు పోటాపోటీలుగా నిర్వహి స్తున్నారు. అయితే కొందరు మూడవ రోజున వినాయకుని నిమర్జన కార్యక్రమం కోలాహలంగా సాగిస్తున్నారు.వాయిద్యాలు, డప్పులు, రంగులు ఒకటేమిటి. వినాయక చవితి దూంధాంగా నిమర్జన కార్యక్రమాలు చేస్తుంటే మరోపక్కన 5వ రోజు, 9వరోజూ వరకుపూజలు చేయన్ను మండపాల్లో అన్నదానాలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నారు. అన్నదానాలు ఏస్తాయికి పోతున్నాయంటే మండపా లల్లో వినియకుడు ఉన్నన్నిరోజులూ అన్నదాన కార్యక్రమాలే కొన్ని చోట్ల నిర్వహిస్తున్నారు. కొందరు సాస్కృతిక కార్యక్రమాలు, పందరి బజనలు, సాంఘి కనాటకాలుఇలా ఎవరికి తోచిన విదంగావారు వినాయక చవితి వేడుకలు ఆనందాల మధ్య జరుపుకుంటున్నారు.

## మైనార్టీ గురుకుల పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించాలి



**నెల్లూరు అర్బన్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** నెల్లూరు నగరంలోని కలెక్టర్ కార్యాలయంలో ముస్లీం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మైనారిటీ గురుకుల పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించాలంటూ నెల్లూరు జిల్లా కలెక్టరుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరు ఆటో నగర్ ప్రాంతంలో మైనారిటీ గురుకుల ప్రభుత్వ పాఠశాల గత కొన్ని సంవత్సరాలుగా ప్రైవేటు భవనంలో నడువుతున్నారు. ఇది చాలా పురాతనమైన భవనం, విద్యార్థులు సుమారు 300 మంది ఉన్నారు. సరైన వసతులు లేవు. ఈ భవనం ఇండస్ట్రియల్ ఏరియాలో ఉన్నందువలన కాలుష్యం ఎక్కువై విద్యార్థులు తరచూ అనారోగ్యం పాలవుతున్నారు. ఈ భవనం బాడు నెలకు లక్ష రూపాయిలు వీటికి పరిష్కారం కోసం గత ప్రభుత్వం కొత్తూరులోని అక్కచెరువుపాడులో 10 ఎకరాలలో 15 కోట్ల రూపాయిలతో మైనారిటీ గురుకుల పాఠశాల నూతన భవనం నిర్మాణం చేశారు. 90 శాతం పనులు పూర్తి అయ్యాయి. అయినా నూతన భవనాన్ని ప్రారంభంచలేదు. గతంలో అనేక సార్లు అధికారుల దృష్టికి ఈ సమస్య తీసుకోవడం జరిగింది. నూతనంగా నిర్మించి ఉన్న 3 భవనాల్లో విద్యార్థులకు అన్ని వసతులతో పాటు అధ్యాపకులకు నివాస గృహాలు నిర్మాణం చేసారు. ఈ మైనారిటీ గురుకుల పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జియా ఉల్లా హక్, సయ్యద్ సమీ, మౌలానా అజీజ్, ఆసిఫ్ ఫాషా, షాహుల్, ఉమర్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

## ఆనందోత్సహాలమధ్య నిమజ్జనోత్సవాలు



**జలదంకి, సెప్టంబర్9, ప్రభాతవార్త:** గణేష్ ఉత్సవాలలో భాగంగ సోమవారం నిమజ్జనోత్సవాలు ఆనందోత్సహాల మధ్య కోలాహలంగ సాగింది. మండల ంలోని పలు గ్రామాలలో ఆయా కూడళ్ళ లో ఏర్పాటుచేసివున్న విఙ్ఞేశ్వర ప్రతిమల వద్ద సందడి నెలకొంది.యువత ముందుగ లడ్డువేలంపాటలను చేపట్టారు.స్వామివారి లడ్డును దక్కించుకునే క్రమంలో పోటీతత్వం నెలకొని వేలల్లో ధర పలికింది లడ్డును దక్కించు కున్నవారు మంగళవాయిద్యాల నడుమ తలపై దాల్చి తమ గృ హాలకు తీసుకు పోయారు. అనంతరం మధ్యాహ్న సమయంనుంచే విగ్ర హాల ను తరలించేప్రక్రియ చేపట్టారు.ఈసందర్బంగ యువత కేరింతలు కొడుతు చిం దులు వేశారు.గణేష్ మహరాజ్‌కేజై అంటు నినాదాలు చేశారు. బాణాసంచా మోతల నడుమ వీధులవెంట ఉత్సవంగ గణనాదులు కావలి తీరానికి తరలి వెళ్ళారు.

## ఘనంగా వినాయక నిమజ్జనం



**వరికుంటపాడు, సెప్టంబర్9, ప్రభాతవార్త:** మండలంలో అనేక గ్రమాలలో గత మూడు రోజులుగ జరుగుతున్న వినాయక చవితి వేడుకలు సోమవారం నిమజ్జనంతో ముగిశాయి.దక్కనూరు గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహంవద్ద గ్రామస్తులు కోలాహలంగ ప్రత్యేకపూజలు నిర్వహించి స్వామివారికి నైవేద్యాలు సమర్పించారు.అలాగే గొల్లపల్లి గ్రామంలో రామాలయంవద్ద ఏర్పాటుచేసిన గణేష్ విగ్రహంవద్ద నార్యాహ కులుపూజాకార్యక్రమాలు నిర్వహించారు.తోటలచెరువుపల్లిలో ఆంజనేయస్వామి గుడివద్ద ఎస్‌సి కాలనీలోని రామాలయంవద్ద ఏర్పాటుచేసిన వినాయకవిగ్రహాలు అందరిని ఆకర్షిస్తున్నాయి.ఆయా విగ్రహాలవద్ద మహిళలు,యువత పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే పాపన్నగారిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహంవద్ద గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు.కాంచెరువు బిసి,ఎస్‌సి కాలనీలలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాలవద్ద పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు.డప్పు వాయిద్యాల నడుమ డిజె,టపాసుల మోతల మద్య వినాయకుని నిమజ్జనం ఆయా గ్రామాల పరిసరాలలో వాగులు, కుంటలలో నిమజ్జనాన్ని ఘనంగ నిర్వహించారు.ఈమూడు రోజులు గ్రామాలలో కోలాహల వాతావరణం నెలకొంది.

## పోటాపోటీగా లడ్డు పాటలు



**వరికుంటపాడు, సెప్టంబర్9, ప్రభాతవార్త:** మండలంలో గత మూడు రోజులుగ అత్యత వైభవంగ జరిగిన వినాయక చవితి వేడుకల్లో భాగంగమూడవరోజు వినాయకుని విగ్రహాలవద్ద లడ్డుల పాటలు పోటాపోటీగ జరిగాయి. మండల ంలోని పాములరుపల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన వినాయకవిగ్రహంవద్ద వున్న లడ్డు హోరాహోరీగ వేలంపాట సాగగ తెల్లగొర్ల సునీల్‌కుమార్ 69వేల రూపా యలకు పాటపాడి సొంతంచేసుకున్నారు.అలాగే కలశంను కూడా వేలం వేయగ తెల్లగొర్ల సుధీర్‌బాబు 20వేల రూపాయలకు దక్కించుకున్నారు. ప్రమిద లను రెడ్లదిన్నె పోతయ్య 15,500రూపాయలకు స్వంతం చేసుకు న్నాడు. కాంచెరువు బిసి కాలని వినాయకుని లడ్డు ఆలా మాధవరావు 32వేలకు సొంతం చేసుకున్నారు.గొల్లపల్లి గ్రామంలో వేర్పాటుచేసిన వినాయక లడ్డు గంగవరపు పద్మయ్య 17,700రూపాయలకు లడ్డును సొంతం చేసుకున్నాడు.ఇలా ప్రతిగ్రామంలో వినాయక లడ్డును సొంతంచేసుకునేందుకు పోటాపోటీగ యువకులు పోటాపడ్డారు.వినాయకుని లడ్డు దక్కించుకుంటే అంతా శుభంజరుగుతుందని నమ్మకంతో లడ్డు వేలంపాటలో ప్రజలు మమేకమ య్యారు.

## గుంటూరులో రజక ఉద్యోగుల మెగా సదస్సు



**వలేటివారిపాలెం సెప్టెంబరు 9, ప్రభాతవార్త :** ఈ నెల 15వ తేదీన గుంటూరులో 'రజక ఉద్యోగుల మెగా ఆత్మీయ సదస్సు' ను నిర్వహిస్తున్నట్లు కందుకూరు ఏరియా రజక ఉద్యోగ సంఘ నేత కండ్లగుంట మోహన్‌రావు తెలిపారు.జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గల రెవిన్యూ కల్యాణ మండపం నందు జరిగే ఈ సదస్సుకు రజక ఉద్యోగ సోదరులంతా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తిచేశారు.ఇందులో పలువురు రజక ఉద్యోగుల సంఘప్రముఖులు పాలొంటారన్నారు. రజకజన సంక్షేమం నిమిత్తం పలు చట్టాలపై అవగాహన, రజకజనాభివృద్ధికోసం చేపట్టాల్సిన చర్యలు,ప్రస్తుతం ఉద్యోగులు ఎదుర్కొ ంటున్న పలు సమస్యలు, పరిష్కార మార్గాలు తదితర అంశాలును పలువురు ప్రముఖులు ఈ సదస్సులో చర్చించనున్నట్లు మోహనరావు తెలిపారు.కావున సదస్సును సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన మోహనరావు సూచి ంచారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ పార్వతి సమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు విశ్వనాధం సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఈ పల్లకి సేవకు ఉభయకర్తలుగా పోకూరు సుబ్బయ్య-నాగేశ్వరమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో రుత్వికులు మురళిస్వామి, వంశీ స్వామి, సుబ్బయ్య స్వామి, భక్తులు ఉన్నారు.

## జేసీబీ ద్వారా పారిశుధ్య పనులు



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలోని మరుగు దొడ్ల ప్రాంతంలో చెత్తాచెదారాలతో పూర్తిగా నిండిపోయింది. ఈ మేరకు ఇటీవల ఆ పాఠశాల తనిఖీకి వచ్చిన జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, సీఈవో కన్నమనాయుడులు ఆ ప్రాంతాన్ని నిశితంగా పరిశీలించి యుద్ధప్రాతిపదికన ఆ ప్రాంతాలను పరిశుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీహరికి సూచనలిచ్చారు. ఈ మేరకు కోవూరు సర్పంచ్ వై. విజయమ్మ ప్రత్యేకంగా చొరవ తీసుకుని జేసీబీ ద్వారా ఆ ప్రాంతంలో ఉన్న చెత్తా చెదారాలను ట్రాక్టర్ల ద్వారా బయటకు పంపేలా చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివకుమార్, తదితరులు ఉన్నారు.

## కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** పొలాలను కౌలుకు తీసుకుని ఆరుగాలాలు కష్టించి పనిచేస్తున్న కౌలు రైతులకు ఎల్ఈసీ కార్డులు అందజేసి ఎకరాకు 20 వేల రూపాయలు పెట్టుబడి సాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం నాయకులు గండవరపు బుజ్జయ్య, శ్రీకాంత్‌రెడ్డిలు తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలుకు తీసుకుంటున్న దేవాదాయ భూములకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ప్రస్తుతం వరి ధాన్యానికి పుట్టి 18750 ఉండగా.. మిల్లర్లు ,దళారులు కుమ్మక్కై 17 వేల రూపాయలు కొనుగోలు చేస్తున్నార న్నారు. ఈ విధంగా దగా చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నేతలు శేషయ్య, విజయ్‌కుమార్, సురేష్, గోవర్ధన్, మోహన్, మల్లికార్జున్‌రెడ్డి, చిన్నమ్మ, తదితరులు ఉన్నారు.

## పడుగుపాడు సొసైటీ మహాజన సభ నేడు



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సభలను ఈ నెల 10వ తేది మంగళవారం సొసైటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కె. సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ మహాజన సమావేశంలో ఇనమడుగు గ్రామంలోని సర్వే నెంబర్ 427-1 ప్రహరీగోడ నిర్మాణం చర్చించుట , 2023-24 సంవత్సరానికి సంబంధించి ఆడిట్ రిపోర్ట్ ఆమోదం, అదేవిధంగా సంఘంలో సభ్యులు సొంత భూమి, కౌలు భూమి లేని వారిని గుర్తించి వారిని తొలగించేందుకు ఆమోదం, ముఖ్యంగా రెడ్‌క్రాస్ సహకారంతో బ్లడ్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని, రైతులు, యువత పాల్గొని ఈ శిబిరాన్ని విజయవంతం చేయాలని సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి తెలిపారు.

## పాఠశాల అభివృద్ధికి కమిటీలు చొరవ చూపాలి



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇటీవల ఎంపికైన పాఠశాల విద్యాకమిటీలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని అభివృద్ధికి తమవం తుగా చొరవ చూపాలని ఎంఈవో-2 చెంచులక్ష్మమ్మ అన్నారు. కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి అధ్యక్షతన పాఠశాల కమిటీ తొలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన ఈ కమిటీలు రెండు సంవత్సరాల పాటు ఉంటాయని పాలకవరనగం ప్రత్యేకంగా చర్చించుకుని పాఠశాలలో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామస్తుల సహకారంతో పాఠశాల అభివృద్ధికి తమవంతుగా చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రధనోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, చైర్‌పర్సన్ ఎస్‌కే షాహీనా, వైస్ చైర్‌పర్సన్ కె. దేవసేనలు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీతామాధిరి, భారతి, కమిటీ సభ్యులు పి. లక్ష్మి, కె. వాణి, బి. కృష్ణవేణి, బి. నాగరాజు, తదితరులు ఉన్నారు.

## ప్రశాంతంగా నిమజ్జనాలు చేసుకోవాలి



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కోవూరు మండల పరిషత్‌లోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసి ఉన్న వినాయక విగ్రహాల వద్ద నిర్వాహకులతో కోవూరు సీఐ సుధాకర్‌రెడ్డి నిమజ్జనం, తదితర విషయాలపై ప్రత్యేకంగా చర్చించారు. విగ్రహ నిమజ్జన సమయంలో ఎటువంటి గొడవలు, అల్లర్లు లేకుండా ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో కొత్తవారు ఎవరైనా కనిపిస్తే వెంటనే అటువంటి సమాచారాన్ని పోలీస్‌స్టేషన్‌కు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు , తదితరులు ఉన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠ శాల విద్యా ర్థులకు విద్యాబు ద్ధులు అందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను తల్లిదండ్రులు పూర్తిస్థాయిలో ఉపయోగిం చుకోవాలని ఐసీడీ ఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నా రు. కోవూరు పరిధిలో శాంతినగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాంలో సోమవారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. సందర్భంగా తక్కువ ఖర్చుతో తయారు చేసే పలు పోషకాహారాలపై గర్బవతులకు, బాలింతలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి రోజూ చిన్నారులకు ఆహారం అందించాలన్నారు. అదేవిధంగా ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త వారి వారి కేంద్రాల పరిధిలో ఉన్న గర్బవతులు, బాలింతలకు సంబంధించి గృహ సందర్శనలు చేసి వారికి పౌష్టికాహారంపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తే, తదితరులు ఉన్నారు.

## ఏపీఈజెయు జిల్లా 4వ మహాసభ పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్




**నెల్లూరు అర్బన్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ యూనియన్ శ్రీ పొట్టి శ్రీ రాములు నెల్లూరు జిల్లా 4వ మహాసభ ఈ నెల 17వ తేదిన జరగనున్న సందర్భంగా దానికి సంబంధించిన పోస్టర్‌ను నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ చేతుల మీదుగా సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు ఉడత రామకృష్ణ, రాష్ట్ర కో కన్వీనర్ గుట్టుపల్లి శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు సరళమ్మ, షేక్ రిజ్వాన్, కలికి ఉదయ్ కుమార్ రెడ్డి, ఆవుల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పిజీ,లా,పరీక్షలకు ప్రాక్టికల్ వన్ టైం ఏర్పాటు చేయాలి ఉపకులపతికి టి.ఎన్.ఎస్ఎఫ్ అధ్యక్షులు వీసికి వినతి



**వెంకటాచలం సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** పిజీ,లా, పరీక్షలకు వన్‌టైం ప్రాక్టికల్ కల్పించాలని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య విజయ భాస్కర్‌రావుకు జిల్లా టిఎన్ ఎస్ఎఫ్ అధ్యకులు పఠాన్ ఆషిక్ అలీ ఖాన్ వినతి పత్రం అందజేశారు .విశ్వ విద్యాలయానికి అనుబంధ పిజీ.లా, కళశాల్లో ఏళ్ల తరబడి ఇంటర్నల్ ప్రాక్టికల్స్‌కు సంబదించిన విద్యా ర్ధి హాజరు కాని పక్షంలో మరల ఇంటర్నల్ ప్రాక్టికల్స్‌ను నిర్వహించకూడదని విశ్వవిద్యాలయ నియమనిబందాలను చెప్పి విద్యార్ధుల భవిష్యను కాలరాస్తున్నారని పేర్కొన్నారు .వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తగు ఆపరాద రుసుమును చెల్లించి మరల విద్యార్ధి,హాజరుకానీ ప్రాక్టికల్స్ పరీక్షలను నిర్వహించే వెసులుబాటు కలదు.విశ్వవిద్యాలయం అలాంటి వెసులుబాటు లేదని,దిని వలన చాల మంది విద్యార్ధులు పీజీలను పూర్తి చేయలేక ఇబ్బందుకు గురిఅవుతున్నారని సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలనాని కోరారు.విద్యార్ధులకు ఉపమోగపడే విదంగా తగు చర్యలు చేపట్టాతామని హామీ ఇవ్వటం జరిగిందన్నారు.


**ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయుట ఏమనగా నా కక్షిదారుడు డా॥ పాల్గారు మురళీశంకర్ రెడ్డి తండ్రి లేట్ పి. శివారెడ్డి, 16-2-142, పొగతోట, నెల్లూరు గారి సంజాయిషీ మేరకు వారికి దిగువ కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని తేది 09.02.1987 న శ్రీ సంధ్యాల చిన శివారెడ్డి అనువారల వద్ద డాక్యుమెంట్ నెం. 232/1987, కావలి సబ్ రిజిష్ట్రార్ ఆఫీసు నందు రిజిష్టరు కాబడిన విక్రయపత్రం ద్వారా కొనుగోలు చేసిన రీత్యా సదరు ప్లాటు స్థలము వారికి పూర్తి హక్కులతోటి సంక్రమించి వారి స్వాధీనానుభవములో వున్నది. నా కక్షిదారుడు 30.08.2024న సాయంత్రం 5.30 గం॥ సమయంలో నెల్లూరు సిటీ, వి.ఆర్.సి. సెంటర్ నుండి అయ్యప్పగుడి సెంటరు పోవుచుండగా సదరు ఆస్తి ఒరిజినల్ విక్రయపత్రములు పోయినదని తెలియజేసినారు. కావున సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరికైనను దొరికనచో వారు దిగువ అడ్రసుకు తెచ్చి ఇవ్వవలసినదిగా కోరడమైనది.

**షెడ్యూలు**

నెల్లూరు రి॥డి॥ యిలాకా కావలి సబ్ రి॥ల్లో చేరిన ముసునూరు, కోదండరామనగర్ (కావలి మునిసిపాలిటీ) ఏరియాలోని సర్వే నెం. 784 లోని లే-అవుట్ ప్లాను నందు ప్లాట్ నెం. 171 రు పూర్తి విస్తీర్ణము 244 చ॥గ॥లు లేదా 30 1/2 అంకణములు ప్లాటు స్థలమునకు హద్దులు: తూర్పు : రోడ్డు, దక్షిణం : ప్లాటు నెం. 172 రు. పడమర: ప్లాటు నెం.164 రు, ఉత్తరం: రోడ్డు, యావత్తు యాజ్‌మెంటు హక్కులతోటిన్నీ.

పి. రమేష్ బాబు, B.Com., B.L., అడ్వకేటు & నోటరి 4/240, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు-524002 (ఆం.ప్ర.) సెల్ : 6281581318

Counter Signed by పాల్గారు మురళీశంకర్ రెడ్డి

**ప్రకటన**

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయుట ఏమనగా నా కక్షిదారుడు డా॥ పాల్గారు వేణుగోపాల రెడ్డి తండ్రి లేట్ పి. శివారెడ్డి, 16-2-142, పొగతోట, నెల్లూరు గారి సంజాయిషీ మేరకు వారికి దిగువ కనబరచిన షెడ్యూలు దాఖలా ఆస్తిని తేది 09.02.1987 న శ్రీ సంధ్యాల చిన శివారెడ్డి అనువారల వద్ద డాక్యుమెంట్ నెం. 229/1987, కావలి సబ్ రిజిష్ట్రార్ ఆఫీసు నందు రిజిష్టరు కాబడిన విక్రయపత్రం ద్వారా కొనుగోలు చేసిన రీత్యా సదరు ప్లాటు స్థలము వారికి పూర్తి హక్కులతోటి సంక్రమించి వారి స్వాధీనానుభవములో వున్నది. నా కక్షిదారుని తమ్ముడు 30.08.2024న సాయంత్రం 5.30 గం॥ సమయంలో నెల్లూరు సిటీ, వి.ఆర్.సి. సెంటర్ నుండి అయ్యప్పగుడి సెంటరు పోవుచుండగా సదరు ఆస్తి ఒరిజినల్ విక్రయపత్రములు పోయినదని తెలియజేసినారు. కావున సదరు ఒరిజినల్ డాక్యుమెంట్ ఎవరికైనను దొరికనచో వారు దిగువ అడ్రసుకు తెచ్చి ఇవ్వవలసినదిగా కోరడమైనది.

**షెడ్యూలు**

నెల్లూరు రి॥డి॥ యిలాకా కావలి సబ్ రి॥ల్లో చేరిన ముసునూరు, కోదండరామనగర్ (కావలి మునిసిపాలిటీ) ఏరియాలోని సర్వే నెం. 784 లోని లే-అవుట్ ప్లాను నందు ప్లాట్ నెం. 164 రు పూర్తి విస్తీర్ణము 244 చ॥గ॥లు లేదా 30 1/2 అంకణములు ప్లాటు స్థలమునకు హద్దులు: తూర్పు : ప్లాటు నెం.171రు, దక్షిణం : ప్లాటు నెం. 165 రు. పడమర : రోడ్డు, ఉత్తరం: రోడ్డు, యావత్తు యాజ్‌మెంటు హక్కులతోటిన్నీ.

పి. రమేష్ బాబు, B.Com., B.L., అడ్వకేటు & నోటరి 4/240, స్టోన్‌హౌస్‌పేట, నెల్లూరు-524002 (ఆం.ప్ర.) సెల్ : 6281581318

Counter Signed by పాల్గారు వేణుగోపాల రెడ్డి


## బినామీ పేర్ల మీద అక్రమ రిజిస్ట్రేషన్లు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

**బిట్రగుంట, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ పరిధిలోని కడనూతల గ్రామంలో సర్వే నెం.840-1లో బినామీ పేర్ల మీద గతంలో పనిచేసిన తహశీల్దార్ నోషనల్ నెంబర్లు అడంగళ్లపై రిజిస్ట్రేషన్లు చేశారని వాటిపై విచారణ జరిపి ఆ సర్వే నెంబరులో నివాసం వుంటున్న దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలని కడనూతలకు చెందిన పైడి ప్రసాద్ తహశీల్దార్ సురేష్‌కు వినతి పత్రం సమర్పించారు. సర్వే నెంబరు 840-1లో 8 ఎకరాల 89 సెంట్ల భూమి వుందని రికార్డుల ప్రకారం అడపాల వెంకట కృష్ణారెడ్డి పేరుపై వుందన్నారు. ఆయన చనిపోయి వంద సంవత్సరాలు దాటిందని కాని దాని మీద కొంత మంది స్థానికులు గ్రావెల్ తవ్వుకోవడంతో పాటు వేరే పేర్ల మీద కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేసి పట్టాదారు పాసుపుస్తకాలు పొంది వున్నారన్నారు. ఈ విషయంపై పలుమార్లు గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా రాజకీయ వత్తిడి మేరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఈ విషయాన్ని ఇటీవల కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి దృష్టికి తీసుకుపోగా విచారణ జరపమని తహశీల్దార్‌ని ఆదేశించడంతో ఆయనకు రాతపూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు.

## గిరిజనులకు బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేసిన ఆపద్బాందవ సేవా ట్రస్ట్



**కావలి రూరల్, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కావలి డివిజన్ పియంపి అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ పిడుగు వెంకట రమణయ్య తండ్రి పిడుగు తిరుపాలయ్య 5వ వర్ధంతి సందర్భంగా కావలి పట్టణంలోని కాలేరిగుంట గిరిజనులకు ఆపద్బాందవ సేవా ట్రస్ట్ దామా మధుసూదనరావు ఆధ్వర్యంలో సోమవారం బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పియంపి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు షేక్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ రమణయ్య, వారి కుటుంబ సభ్యులు ప్రతి సంవత్సరం తండ్రి వర్ధంతి సందర్బంగా ఆయనను గుర్తుంచుకుని ఆయన పేరు మీద అన్నదానం, సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా వుందన్నారు. ప్రతి ఒక్కరు తల్లిదండ్రులను గుర్తుంచుకొని వారి పేరు మీద సేవా కార్యక్రమాలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపద్బాందవ సేవా ట్రస్ట్ దామా మధుసూదనరావు, ఒట్టూరు మస్తానయ్య, గంటశాల రామచంద్రయ్య, టైంటూ హెల్ప్ రమేష్, లోక్‌సత్తా మాలకొండారెడ్డి, తదితరులు పాల్గొని బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

## మహాయాగ పౌండేషన్ నేతృత్వంలో గర్బిణిలకు పౌష్టికాహారం



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో మహాయాగ పౌండేషన్ చైర్మన్ లోకేష్ ఆధ్వర్యంలో,కోదండరామిరెడ్డి సహకారంతో గర్భిణి స్త్రీలకు పౌష్టికాహారాన్ని అందజేశారు.ఈకార్యక్రమంలో హాస్పటల్ సూపర్నెంట్ డాక్టర్ పద్మజా గర్బిణిస్త్రీలకు పౌష్టికాహారం మందులు అందజేశారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు గత రెండు సంవత్సరాలుగా మహాయాగపౌండేషన్ ద్వారా గర్భిణి స్త్రీలకు పౌష్టికాహారం అందచేస్తున్నారని ఆమె వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా అనేకచోట్ల వీరు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అలాగే టిడిపి నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి వైద్యశాలకు అనేక మెడికల్ పరికరాలు అందజేశారని ఆమె ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు దొడ్ల కోదండరామిరెడ్డి మాట్లాడుతు మహాయాగ పౌండేషన్ ప్రతి నెల 9 వ తేది గర్బిణి స్త్రీలకు పోషకాహారాన్ని అందచేయడం అభినందనీయమని ప్రశంసించారు. నేను కూడా ఈ సంస్థలో వాలింటర్‌గా చేరానని ఆయన స్పష్టం చేశారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో హాస్పటల్ అభివృద్ధి చేస్తామని ఆయన హామి ఇచ్చారు. ఈకార్యక్రమంలో మనోజ్, రవితేజ,చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ భూముల కౌలు పాటలు ప్రశాంతం



**ముత్తుకూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త :** బ్రహ్మదేవం పంచాయితీ కైలాసనాథ స్వామి దేవస్థానం భూములకు సంబంధించి కౌలుకు బహిరంగ వేలం పాటను సోమవారం దేవస్థానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపల్లి రమేష్ శర్మ మాట్లాడుతూ 57 ఎకరాల 37 సెంట్లు కౌలుకు రైతులకు ఇవ్వడం వల్ల దేవస్థానానికి ఆదాయం సుమారుగా 11 లక్షల 58 వేల 500 రూపాయిలు రావడం జరిగిందన్నారు. మూడు సార్లు వేలం పాటలు వాయిదా పద్దాయని ఒక్కసారి రైతులకు ధ్యానం రేట్లు పుట్టి 24 వేల నుంచి 16 వేలకు పడిపోవడం అలాగే 16 వేల నుంచి 7 వేలకు పడిపోవడం వల్ల రైతులు అందరూ కలుసుకుని రైతులకు నష్టం కలగకుండా అలాగే దేవాలయానికి ఆదాయం నష్టం కలుగకుండా రైతులందరూ ఆలోచించి ఈ వేలం పాటను ప్రశాంతంగా జరిపారు. గత ప్రభుత్వంలో వేలం పాటను తలుపులు వేసి నిర్వహించి మొదటి సంవత్సరం కొత్త రాబడి ఇచ్చారని తరువాత రాబడి తగ్గించారన్నారు. అలాంటి విషయాలు పునరావృతం కాకుండా రైతులు స్వేచ్ఛగా వేలం పాటలో పాల్గొని వాళ్ళపాటను పాడుకునే విధంగా ఈ వేలం పాట నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డోమెంట్ అధికారి చైతన్య, మోహన్ కుమార్, యానాదయ్య, చిరంజీవి, గ్రామస్తులు విష్ణువర్ధన్ రామా, ధీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## వవ్వేరు కో,ఆపరేటివ్ రూరల్ బ్యాంకులో మహాజనసభ



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని వవ్వేరు కో ఆపరేటివ్ రూరల్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ మహాజనసభను నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పర్సన్ ఇన్‌చార్జి సీనియర్ ఇనస్పెక్టర్ కట్టా సుబ్రమణ్యం, ఉపవిభాగేయ సహకారాధికారి కోవూరు ఎం.వి. సుభాషిణి, సీనియర్ ఇనస్పెక్టర్ మరియు సెల్ ఆఫీసర్ సురేష్ పాల్గొన్నారు. మొట్టమొదటగా సమావేశంలో సిఇఒ శ్రీనివాసులు బ్యాంకు ఆర్థిక లావాదేవీలను గురించి వివరించారు. బ్యాంకు సభ్యులైన ముత్యాల గురునాధం మాట్లాడుతు డివిడెంట్ 18 శాతం కావాలని కోరారు. రైతులందరు కూడా 18 డివిడెంట్‌కే మొగ్గు చేపడంతో పర్సన్ ఇన్‌చార్జి,సీనియర్ ఇనస్పెక్టర్‌లు మాట్లాడుతు ఈవిషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని వెళ్ళి ఖచ్చితంగా పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. అనంతరం నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి మాట్లా డుతు బ్యాంకులో సిబ్బంది ఎక్కువ కావడం వల్ల భారం రైతుల నెత్తిన పడుతుందని చెప్పారు. అనం తరం బొమ్మ సుబ్బారెడ్డి మాట్లాడుతు ఈ సారి అయినా వవ్వేరు బ్యాంకు చైర్మన్‌ను ఉన్నతమైన వ్యక్తికి ఇవ్వాలని సూచించారు. అనంతరం అధికారులు మాట్లాడుతు దీర్ఘ కాలిక రుణాలు చెల్లించడంలో రైతులు వెనుకబడి ఉన్నారని సకాలంలో బ్యాంకు లోన్లు చెల్లించాలని వారు కోరారు. 3 వందల షేర్ ధనం కలిగి ఎటువంటి భూమి వివరాలు లేనివారు సెప్టెంబర్ 31 లోపు వారి భూమి వివరాలు తెలియజేయాలని సూచించారు. రైతులు,బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## కోలహలంగా లడ్డు వేలంపాట



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని లైలా కాన్వెంట్ వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహం వద్ద లడ్డు వేలాం పాట కోలహలంగా సాగింది. ఈ సంవత్సరం లడ్డు వేలం పాటను అచ్చుత్ దినేష్ కుమార్, దర్శి హరీష్, దర్శి మనోజ్, కృష్ణం కిరణ్, గోనుగుంట అరుణ్‌కుమార్, తెల్లనాకుల నితీష్, పబ్బిశెట్టి హరి, దర్శి మహేష్, మౌర్యదక్కించుకున్నారు.18 వేల 216 వందలకు లడ్డు దక్కించుకు న్నారు. పాట అనంతరం యువకులందరు మంగళవాయిద్యాలతో ఉరేగింపు నిర్వహించారు.

## గ్రామసభలో తీర్మానాలపై సమీక్ష



**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ఇటీవల గ్రామసభల్లో అభివృద్ధి పనులకు పలు తీర్మానాలు చేయడం జరిగింది. ఈ మేరకు ఎంపికైన ఆ పనులకు సంబంధించి సంబంధిత గ్రామాల్లోని ప్రజాప్రతినిధులు టీడీపీ నాయకులతో సోమవారం ఎంపీడీవో శ్రీహరి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. గ్రామ సభలో ఎంపిక చేసిన పనుల్లో ప్రాధాన్యత క్రమంలో ఎంపిక చేసుకుని ఆ పనులు చేపట్టేలా ప్రజాప్రతినిధులు, నాయకులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీరాజ్ ఏఈ పరమేశ్వరలింగం, లేగుంటపాడు సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, నేతలు సుబ్బానాయుడు, లక్ష్మీనరసారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, మల్లికార్జున్‌రెడ్డి, జెట్టి మదన్‌రెడ్డి, కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, ఆదాల శివారెడ్డి, తదితరులు ఉన్నారు.

## కోవూరును క్యాన్సర్ రహిత సెగ్మెంట్‌గా మారుద్దాం




**కోవూరు, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** : క్యాన్సర్ గురించి బయపడాల్సిన అవసరం లేదని, ఇది అంటువ్యాధి కాదని, క్యాన్సర్‌కు చికిత్స కూడా ఉందని,కోవూరు నియోజకవర్గాన్ని క్యాన్సర్ రహిత నియోజకవర్గంగా మారుద్దామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు కోవూరు నియోజకవర్గం వ్యాప్తంగా మహిళలకు ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించేలా ఒక ప్రత్యేక బస్సును కూడా ఏర్పాటు చేశారు. వాస్తవంగా మహిళలే ఎక్కువ మంది ఈ వ్యాధిబారిన పడుతున్నారని, తమ ఎన్నికల ప్రచారం సందర్భంగా చాలా మంది బాధిత మహిళల దయనీయ పరిస్థితి చూడడం జరిగిందని, అటువంటి మహిళలకు ఉచితంగా క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని అప్పట్లోనే ప్రశాంతిరెడ్డి నిర్ణయించుకున్నారు. వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా బస్సులో బ్రెస్ట్ క్యాన్సర్, నూట్రస్ క్యాన్సర్ , ఒరల్ క్యాన్సర్‌కు సంబంధించి ఉచిత పరీక్షలు కూడా ఈ బస్సులో నిర్వహించే ఏర్పాటు కూడా ఫౌండేషన్ ద్వారా ఎమ్మెల్యే అన్ని చఉర్యలు తీసుకున్నారు. 40 రోజులపాటు మహిళలకు ఈ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన బస్సు అన్ని గ్రామాల్లో పర్యటించేలా ప్రణాళికలు సిద్ధంచేశారు. తొలిసారిగా కోవూరు నియోజకవర్గం పరిధిలోని ఇందుకూరుపేట గ్రామంలో ఎంకేఆర్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న షాదిమంజిల్ ప్రాంగణంలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపాల్గొనేలా అన్ని ఏర్పాటుచేపట్టారు.ఇటువంటి మంచిఅవకాశాన్ని వారుఉపయోగించుకోవాలని కోరుతున్నారు.

## విజయవాడకు తరలివెళ్లిన రెడ్‌క్రాస్ వైద్య సహాయ బృందం




**కావలి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** విజయవాడ వరద ప్రభావిత ప్రాం తాలలో వైద్య శిబిరాల నిర్వహణ నిమిత్తం కావలి రెడ్‌క్రాస్ వైద్య సహా య బృందం సోమవారం విజయ వాడకు తరలివెళ్లింది. దాదాపు లక్షా 10 వేల రూపాయల విలువైన మం దులతో కావలి రెడ్‌క్రాస్ విపత్తు నిర్వ హణ విభాగ కన్వీనర్, ప్రథమ చికిత్స శిక్షకుడు బీద లక్ష్మీనంద నాయకత్వంలో ఈ బృందం బయలుదేరింది. ఈ బృందానికి కావలి రెడ్‌క్రాస్ ప్రతినిధులు దాకారపు రవిప్రకాష్, రెడ్‌క్రాస్ కోశాధికారి, జిల్లా కమిటీ సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, హరినారపరెడ్డి, బి.ఎస్.ప్రసాద్, బాలు, తదితరులు జెండా ఊపి ఈ బృందానికి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎ.శ్రీధర్‌రెడ్డి, జిల్లా చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డిల ఆదేశాల మేరకు విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాలలో రెడ్‌క్రాస్ నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాలలో సేవలందించేందుకు, ఔషధ రంగంలో అనుభవం వున్న వాలంటీర్లను, లక్షకు పైగా విలువైన మందులను పంపామన్నారు. వరద తగ్గిన తర్వాత జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం నిర్వహించే శిబిరాలతో పాటు పలు లోతట్టు ప్రాంతాలలో రెడ్‌క్రాస్ వైద్య సేవలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ సూచన మేరకు కావలి రెడ్‌క్రాస్ వాలంటీర్లు వంతుల వారిగా సహాయ కార్యక్రమాలలో పాల్గొంటారని తెలిపారు. దాదాపు ఒక వెయ్యి దుస్తుల కిట్లను కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. త్వరలో వాటిని కూడా పంపిణీ చేస్తామన్నారు. వైద్య సహాయ బృందంలో నచికేత్, సాయికుమార్, వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రవీంద్ర భారతిలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



**నెల్లూరుసెప్టెంబర్9, ప్రభాత వార్త విద్య,** రవీంద్ర భారతి ఇంగ్లీష్ మీడియం, నవపేట బ్రాంచ్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ప్రిన్సిపల్ నిరూపమా డీన్ శ్రీని వాస్ రెడ్డి ఉపాధ్యాయులు, విద్యార్థుల తాతయ్యలు, నానమ్మలు, అమ్మమ్మలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలు జయప్రదం చేశారు. విలువల్లో కూడిన విద్య, అనేది రవీంద్ర భారతి స్కూల్ యొక్క, ముఖ్య ఉద్దేశమని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అక్కడ ఇంచార్జి సుమలత, పెద్దల యొక్క ఆశీస్సులు దీవెనలు ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా తెలియజేశారు.

## బుచ్చిరెడ్డిపాళెం కో ఆపరేటివ్ రూరల్ బ్యాంకు మహాజన సభ



**బుచ్చి సెప్టెంబర్ 9 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీలోని ది బుచ్చిరెడ్డిపాళెం అగ్రికల్చరల్ క్రెడిట్ సొసైటీ మహాజన సభ సమావేశం సోమవారం బ్యాంకు ఆవరణంలో నిర్వహించారు. ముఖ్య అతిధులుగా అసిస్టెంట్ రిజిస్టార్. ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి జి.నిర్మల అధ్యక్షత వహించారు. సమావేశంలో సహకార శాఖకు చెందిన సీనియర్ ఇనస్పెక్టర్ శివకుమార్, సీనియర్ ఇనస్పెక్టర్ సుబ్బరామిరెడ్డి సీనియర్ ఇనస్పెక్టర్ పద్మజ ,సెల్ ఆఫీసర్ సురేష్‌కుమార్, పాల్గొన్నారు. సహకారం సంఘ సిఇఒ సురేష్‌కుమార్‌రెడ్డి బ్యాంకు ఆర్థిక లావాదే విలు 20 23,24 ఆడిట్ నివేదిక వివరించారు. సమావేశంలో సంఘ లాభాల నుండి 15 శాతం డివి డెంట్ ప్రకటించారు. సభ్యులు వ్యవసాయ పనిముట్లు కావాలని కోరారు. అదే విధంగా బ్యాంకు పైన స మావేశ మందిరం కావాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన అధికారులు డిఆర్ దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. ప్రతి రైతు కెవైసి చేయించుకోవాలని సిఇఒ సురేష్ కుమార్‌రెడ్డి కోరారు. ఈకార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## జిల్లా ఏపీఎన్‌జీజీఓస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 1,00,116 చెక్ అందజేత



**నెల్లూరుఅర్బన్, సెప్టెంబర్ 9,ప్రభాత వార్త** ఇటీవల విజయవాడ నగరంలో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న వరద బాధితుల సహాయార్థం నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో కలెక్టర్ ఓ. ఆనంద్‌కి నెల్లూరు జిల్లా ఏపీఎన్‌జీజీ ఓస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ మన్నేపల్లి పెంచలరావు ఆధ్వర్యంలో వరద బాధితులకు రూ. 1,00,116 ముఖ్యమంత్రి సహాయ నిధి పేరుతో కలెక్టర్‌కి చెక్కును అందించడం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ ఇలాంటి ప్రమాదకర విపత్తులు సంభవించినప్పుడు సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి వరద బాధితులకు సహాయం చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఏపీఎన్‌జిజి ఓస్ అసోసియేషన్ నాయకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు బి. వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షులు ఎన్. ఆంజనేయవర్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి. రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మధు, జిల్లా సంయుక్త కార్యదర్శులు ఈ. విజయ కుమారు. ఎల్. పెంచలయ్య, జి. సువర్ణ, రాష్ట్ర మహిళా కో చైర్ పర్సన్ స్వర్ణలత, మహిళా జిల్లా చైర్ పర్సన్ యు. చిన్నమ్మ, రాపూరు తాలుకా అధ్యక్షులు టి. మల్లికార్జున, నెల్లూరు నగర కోశాధికారి సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి జనార్ధన్, నగర ఉపాధ్యక్షులు ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఐదులాంతర్ల సెంటర్ వినాయకుడు కోలాహలం మధ్య నిమజ్జనం



**కావలి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** కావలి పట్టణం ట్రంకురోడ్డు ఐదులాంతర్ల సెంటర్‌లో యువ వ్యాపారస్తులు ఏర్పాటు చేసిన వినాయకుడు విగ్రహ నిమజ్జనం సోమవారం కోలాహలం, కేరింతల మధ్య సాగింది. ట్రాక్టర్‌లో వినాయకుడిని ఊరేగించారు. డప్పు వాయిద్యాల మధ్య యువ వ్యాపారస్తులు డాన్సులు వేస్తూ వినాయక పాటల మధ్య సముద్ర తీరానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐదు లాంతర్ల సెంటర్ వినాయక విగ్రహ కమిటీ బాధ్యులు, యువ వ్యాపారవేత్తలు ఎ.బదరీనారాయణ, రామకృష్ణ, గోపాల్, పవన్, సురేంద్ర, తేజ, అను, నితిన్ గ్రూప్ బాబీ ఫ్రేమ్, అఖిల్, అరవింద్, మనోజ్‌కుమార్, జి.వి.ఎస్.ప్రసాద్, ప్రభాకర్, కొటాక్ మహేంద్ర విశ్రాంత ఉద్యోగి కెవియన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రులు వద్దకు బిడ్డను చేర్చిన స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమం



**నెల్లూరు అర్బన్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** నెల్లూరు ఆర్‌టిసి మెయిన్ బస్టాండులో మూడు నెలల బస్టాండు ఆవరణలో వదిలి వెళ్ళిన కసాయి తల్లి ఆర్‌టిసి పోలీస్ వద్ద ఉంచి సాయంత్రం వరకు ఎవరు రాకపోతే జిల్లా బాలల సంరక్షణ అధికారికి బి. సురేష్‌కి సమాచారం రావడంతో డిసిపియు స్టాఫ్ సమత, పెంచల లక్ష్మి, ఆర్టీసి బస్టాండ్‌కి వెళ్ళి ఆర్టిసి యాజమాన్యం పోలీస్ వారితో మాట్లాడి బిడ్డను తీసుకొని నెల్లూరులోని శిశు గృహంకు తీసుకొని వచ్చి శిశు గృహంకు అప్పగించారు. బిడ్డ దొరికిన చిన్న బజార్ పోలీస్ స్టేషన్‌లో పాపకు సంబంధించి సెక్షన్ 317 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేపించడం జరిగింది. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన దగ్గర నుండి జిల్లా బాలల సంరక్షణ అధికారి సిబ్బందిని టీమ్స్‌గా వేసి ఈ బిడ్డ తల్లిదండ్రులు కోసం వెతికే ప్రయత్నం చేయగా నెల్లూరు నగరం ఆచూకీ తెలియడంతో జిల్లా స్త్రీ అభివృద్ధి, శిశు సంక్షేమ సాధికార అధికారిణి బి. హేనసుజున్ చేతులు మీదుగా బిడ్డను తల్లిదండ్రులుకు అప్పగించారు. దొరికిన బిడ్డను వారం రోజుల్లో తల్లిదండ్రులు చెంతకు చేరేలా చేయడంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి బి. సురేష్ చాలా చొరవ తీసుకొని సిబ్బందితో వెతికించారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగుదేశం గూటికి చాకిచర్ల సర్పంచ్



**ఉలవపాడు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** వైసీపీ మద్దతుతో గెలిచిన ఉలవపాడు మండలం చాకిచర్ల పంచాయతీ సర్పంచ్ వీరమల్లు విజయమ్మ సోమవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరగా ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. సర్పంచ్‌తో పాటు 10వ వార్డు సభ్యులు ప్రళయకావేరి అంకయ్య, వైసీపీ నేత తోట వెంకట నారాయణ తదితరులు పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావుపై నమ్మకం, ఆయన కల్పిస్తున్న భరోసాతో టీడీపీలో చేరుతున్నామని సర్పంచ్ తెలిపారు. వైసీపీ పాలనలో పంచాయతీలో చిన్న అభివృద్ది కార్యక్రమం కూడా చేపట్టలేకపోయామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాలతో పంచాయతీల్లో మళ్లీ వెలుగులు నిండుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన వారు ఎమ్మెల్యే నాగేశ్వరరావుని శాలువాతో సత్కరించారు. గ్రామాభివృద్దికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సర్పంచ్‌కు హామీ ఇచ్చారు. పారిశుద్యం, తాగునీరు, ఇతర అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి, ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో చాకిచర్ల గ్రామ టీడీపీ అధ్యక్షుడు మిరియం మల్లిఖార్జున, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న సిఐ శ్రీనివాసులురెడ్డి



**బుచ్చి సెప్టెంబర్ 9ప్రభాతవార్త** వినాయకచవితి పురస్కరించుకొని బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలోని నేతాజి నగర్ 4 వ వీధిలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహంను సిఐ శ్రీనివాసులరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గోని ప్రజలకు వడ్డించారు. ఈ సందర్భంగా బిజెపినాయకులు పెంచల ప్రసాద్ మాట్లాడుతు గత 12 సంవత్సరాల నుండి విగ్రహాన్ని పెడుతున్నట్లు తెలిపారు.ఈ సంవత్సరం అన్నదాన ఉభయకర్తలుగా వెంకరమణబాబు కల్పన వ్యవహారించినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు గంది రఘురామయ్య అల్లూరు శ్రీనివాసులు, గెరికబాబు, అల్లూరు ప్రశాంత్, సంతోష్‌కుమార్, రూపేష్, క్రిష్టారెడ్డి, షేక్ ఖాసిం, సతీష్‌కుమార్, వెంకటేశ్వర్లు, శ్రీదర్,గంజంప్రదీప్ పాల్గొన్నారు.

## కావలి వినాయక నిమజ్జనంలో అపశృతి



కావలి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త వినాయక నిమజ్జనానికి వెళుతూ ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైర్ కింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. కావలి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన మొగిలి రమేష్ నిమజ్జనానికి తుమ్మలపెంట సముద్రానికి వెళ్తుండగా కొనదిన్నె గిరిజన కాలనీ సమీపంలో ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. ట్రాక్టర్ టైరు అతనిపై ఎక్కడంతో రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌ను కావలి ఏరియా వైద్యశాలకు తరలించగా మృతి చెందాడని డాక్టర్లు ధృవీకరించారు. పోస్టుమార్టానికి తరలించారు. మృతుడు కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. బేల్దారి పనిచేస్తూ జీవనం సాగిస్తున్న రమేష్ మృతి చెందడంతో ఇందిరానగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## కావలిలో అంబరాన్నంటిన గణేష్ నవరాత్రి ఉత్సవ వేడుకలు !

### ప్రశంసలందుకుంటున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి





**కావలి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** కావలి టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎయంసి చైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సతీమణి మాజీ కౌన్సిలర్ మలిశెట్టి విజయలక్ష్మి దంపతులు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరుగుతున్న గణేష్ నవరాత్రి ఉత్స వాలు కావలిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. కావలి ప్రాంతంలో ఎవరు చేయలేని విధంగా లక్షలాది రూపాయల వ్యయంతో మలిశెట్టి దంపతులు 9 రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తూ అందరి ప్రశం సలు అందుకుంటున్నారు. కావలి పట్టణ గ్రామదేవత శ్రీ కలుగోళ శాంభవి దేవి ఆలయ ప్రాంగణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఈ నెల 7వ తేదిన ప్రారంభమయ్యాయి.15వ తేది వేడుకలు ముగు స్తున్నాయి. 9 రోజుల పాటు ప్రతి రోజు రాత్రి 8 గంటలకు వేద పండితులు నిర్వహిస్తున్న దశ హారతులు తిలకిస్తున్న భక్తులు పులకిస్తున్నారు. 9 రోజుల పాటు రాత్రి వేళలలో భరతనాట్య ప్రదర్శన, గొప్ప సినీ పాట కచ్చేరి, పార్వతి కళ్యాణం నృత్య రూపకం,డాన్స్ ప్రోగ్రాం, శ్రీరామ పట్టాభిషేక నృత్య రూపకం, రేలారే రేలా జానపద నృత్యం, అష్టలక్ష్మి వైభవ నృత్యరూపకం, డాన్స్‌బి డాన్స్ నృత్య రూపకం కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కావలి పట్టణ మాసన సెంటర్ రోడ్డు విద్యుత్ దేదీప్యమాన అలంకారాలతో ప్రత్యేకతను చాటిచెబుతుంది. పెద్దపెద్ద విద్యుత్ దేవతల కటౌట్లు కావలిని ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. కలుగోళ శాంభవి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా రూపొందించిన అష్టలక్ష్మి విగ్రహాలు, దేవతామూర్తులు అందరిని ఆకర్షిస్తున్నాయి. భారీ సెట్టింగ్ మధ్య భక్తులు నిత్యం దర్శించుకుంటున్నారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ గణనాధుడిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మలిశెట్టి దంపతులు దగ్గరుండి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. దాదాపు 8 సంవత్సరాల పాటు మలిశెట్టి నాయకత్వంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఈ జిల్లాలోనే ప్రత్యేకంగా నిలుస్తున్నాయి. ప్రతి రోజు వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది గణేష్ వేడుకల్ని దర్శించుకుని తరిస్తున్నారు. ఆదివారం రాత్రి మణి ఈవెంట్స్ హైదరాబాద్ వారిచే గొప్ప సినీ పాటకచ్చేరి జరిగింది. పాడుతా తీయగా ఆర్కెస్ట్రా టీం నేపధ్య గాయని సాహితి తన గానామృతంతో అందర్ని ఆకట్టుకుంది. పోలీస్ బందోబస్తు మధ్య ఈ వేడుకలు జరుగుతున్నాయి.

## హెల్త్ సెంటర్‌ని ఆకస్మిక తనిఖీ చేసిన ఖాదర్‌వల్లి



**నెల్లూరు, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త–వైద్యం** నెల్లూరు జిల్లా లెప్రసి ఎయిడ్స్ అండ్ టీబీ ఆఫీసర్ డాక్టర్ షేక్ ఖాదర్‌వల్లి నెల్లూరు నగరంలోని ఎన్‌బీటీ కాలనీ, ప్రహతి నగర్ స్ట్రీట్ అర్బన్ హెల్త్ సెంటర్స్‌ని ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేశాడు. ఈ తనిఖీలో భాగంగా అడిషనల్ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ యూపీఎస్ఎల్‌లో జరిగే ప్రెసెంట్ టీబీ ఎగ్జామినేషన్స్‌ని ఖాదర్‌వల్లి పరిశీలించాడు. దీనికి సంబంధించి యూపిఎస్సీ సిబబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. టీబీ నివారణ సిబ్బంది, యూపీహెచ్‌సీ ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## 4లక్షల రూపాయలు విరాళం అందజేసిన తెలుగునాడు ఉపాధ్యాయుల సంఘం



**ఆత్మకూరు,సెప్టెంబర్9ప్రభాతవార్త:** విజయవాడ వరద బాధితుల సహా యార్థం తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మన్నెం శ్రీనివాస్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సోమవారం 4లక్షల రూపాయల చెక్కును సిఎం సహాయ నిధికి అందిం చారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపాధ్యాయులు విద్యాబోధనలోనే కాకుండా ఇలాంటివిపత్కర పరిస్థితుల్లో సామాజిక బాధ్యత గా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు , ఉపాధ్యాయులు చెరుకూరు పూర్ణచంద్రరావ్,కైతేపల్లిదాస్, రాష్ట్ర కార్యదర్శి తలపనేని రామారావ్ ,కొత్తగొర్ల వెంకటరావ్, మోహన్‌రావ్, యనమల ఆంజనేయులు, రవీంద్ర, కొమ్మినారాయణ, రేపూడి శ్రీనివాస్, మేడా రామలింగయ్య, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరద బాధితుల కోసం
## ఏసి సుబ్బారెడ్డి వర్తకుల సంఘం దాతృత్వం

**నెల్లూరు రూరల్, సెప్టెంబర్ 9, ప్రభాతవార్త** మానవతా దృక్పథంతో విజయవాడ వరద బాధితులను బాసటగా నిలిచి సహాయం అందించాలన్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పిలుపు మేరకు నెల్లూరు అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ అధికారుల ఆధ్వర్యంలో ఏసి సుబ్బారెడ్డి వర్తకుల సంఘం 15 టన్నుల కూరగాయలు సేకరించారు. విజయవాడ వరద బాధితుల సహాయార్ధం ఏసి సుబ్బారెడ్డి వర్తకుల సంఘానికి చెందిన అధ్యక్షులు తాతిరెడ్డి, కార్యదర్శి బి. మోహన్ రావు, ఉపాధ్యక్షులు నాగేశ్వర రావు, కోశాధికారి వెంకటేశ్వర రావు, కమిటీ సభ్యులు గాయాజుద్దీన్, రాంబాబు నేతృత్వంలో రాంబాబు కమిటీ సభ్యుల నేతృత్వంలో వ్యాపారస్తుల ఉర్లగడ్డలు 2,500 కిలోలు, గోరు చిక్కుడు కాయలు 3 వేలు కిలోలు, బీట్ రూట్ 1000 కిలోలు, క్యాబేజి 2000 కిలోలు, పచ్చిమిర్చి 1500 కిలోలు, టమోటాలు 1500 కిలోలు, దొండకాయలు 1000 కిలోలు, వంకాయలు 800 కిలోలు, మునక్కాయలు 200 కిలోలు, సొరకాయలు 500 కిలోలు మొత్తం 15000 కిలోల కూరగాయలు సేకరించి రెండు లారీలలో నెల్లూరు నుంచి విజయవాడకు తరలించడానికి సిద్ధం చేసారు. విజయవాడ జల విపత్తులో సర్వస్వం కోల్పోయిన బాధితులను ఆదుకునే పుణ్య కార్యంలో భాగస్వాముల్ని చేసిన నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ ఒరెడ్డికి, ఎఎంసి అధికారులకు మానవతా దృక్పధంతో స్పందించి తమ సహాయం అందించిన వ్యాపారస్తులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. మంగళవారం ఉదయం 7 గంటలకు అధికారులు, వ్యాపారస్తులు సమక్షంలో రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి కూరగాయల లారీలకు జెండా ఊపి ప్రారంభిస్తారు.

## అక్రమ సంబంధమే దారుణ హత్యకు దారితీసింది ...ఐదు మంది అరెస్ట్




**కావలి, సెప్టెంబరు 9 ప్రభాతవార్త** అక్రమ సంబంధమే వ్యక్తి దారుణ హత్యకు దారితీసిందని కావలి డిఎస్పీ వెంకట రమణ తెలిపారు. కావలి డిఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దగదర్తి దారుణ హత్య సంఘటనపై కావలి డిఎస్పీ వెంకట రమణ వివరాలు వెల్లడించారు. ఒక మహిళతో వున్న అక్రమ సంబంధం వల్ల నాగులూరి ప్రభయ్య దారుణ హత్యకు గురయ్యాడని తెలిపారు. ఈ దారుణ హత్యలో 8 మంది ముద్దాయిలను గుర్తించినట్లు తెలిపారు. వారిలో ప్రస్తుతం ఐదు మందిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. గురునాథం మధు, గురునాథం రవి, గురునాథం సురేంద్ర, గురునాథం మహేంద్ర, గురునాథం తిరుపతయ్య, గురునాథం బలరామయ్య, గురునాథం బాలరాజు, గురునాథం దశయ్యలు కలిసి ప్రభయ్యను అత్యంత పాశవికంగా కత్తితో తలపై నరికి రాడ్లతో, కర్రలతో కొట్టి హత్య చేశారని తెలిపారు. దగదర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసుకు సంబంధించిన వివరాల్ని వివరించారు. గురునాథం మధు చెల్లెలు అనితతో మృతుడు నాగలూరి ప్రభయ్య అక్రమ సంబంధం పెట్టుకోవడాన్ని జీర్ణించుకోలేక వారు దారుణ హత్యకు పాల్పడ్డారని తెలిపారు. మద్యానికి బానిసైన ప్రభయ్యను ఒక పథకం ప్రకారం కుట్ర పన్ని ఈ నెల 1వ తేది మధ్యాహ్నం రంగసముద్రం–ఐతంపాడు గ్రామాల మధ్యన ఒక చోటకు ప్రభయ్యను రప్పించి ముద్దాయిలు దారుణంగా హత్య చేశారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఐదు మందిని మాత్రమే ఈ రోజు అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన ముద్దాయిలు గురునాథం దశయ్య, గురునాథం బలరామయ్య, గురునాథం బాలరాజులను అరెస్ట్ చేయాల్సి వుందన్నారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ పాపారావు, దగదర్తి ఎస్ఐ జంపాని కుమార్‌లు పాల్గొన్నారు.